Licensed to post without Prepayment No. J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 08.03.2019, శుక్రవారం సంపుటి : 38 సంచిక : 40 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# దొరలే డేటా దొంగలా?

- ఏపి ఓట్ల చోరులెవరు?
- తెలుగుదేశం నేతల చుట్టూ ఉచ్చు
- ప్రజల హక్కును రెండు రాష్ట్రాల వివాదంగా మలచాలని చూస్తున్న చంద్రబాబు



భారతదేశ రాజకీయ చరిత్రలో నాటి నెహ్రూ నుండి నిన్నటి వై.యస్. రాజశేఖరరెడ్డి వరకు ఎందరో నాయకులు ఎన్నికల్లో తమ పార్టీలను ముందుకు నడిపించారు. ఎన్నికల్లో గెలుపు కోసం రాజమార్గాలనే ఎంచుకున్నారు. ప్రజలకు తాము చేసినవి చెప్పుకున్నారు... చేయాలనుకుంటున్నది వివరించారు. వారి నాయకత్వాలను ప్రజలు అంగీకరిస్తే, వారి పరిపాలనను ఆదరిస్తే మళ్ళీ అధికారంలో

నిప్పులు చెరిగే సూర్యుడు కూడా అక్కడ జనసందోహం చూసి తెల్లముఖం వేశాడు. మిట్ట మధ్యాహ్నం నడినెత్తి మీద సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నా జనం కదల్లేదు... మెదల్లేదు... వేలాదిగా పోటెత్తి వచ్చిన జన సమూహం ముందు ఎండ కూడా వెలవెలపోయింది.

# మాయలోడితో పోరాడుతున్నాం!

- జననేతకు నీరాజనం!



11లో



# ఎన్నికల నిబంధనలు తప్పక పాటించాలి

## - జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు



సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు

ఎన్నికల నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విధులలో ఎంతమాత్రం అలసత్వం పనికిరాదని జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు అన్నారు. ఈనెల 6న ఆయన నెల్లూరులోని కొత్త జడ్పీ సమావేశ మందిరంలో అసెంబ్లీస్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వివి పాట్స్ మరియు ఎన్నికల ప్రక్రియపై నిర్వహించిన శిక్షణాశిబిరంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, వివి ప్యాట్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకుని తదనుగుణంగా నియోజకవర్గంలోని మిగతావారికి శిక్షణ ఇవ్వాల్సి ఉంటుందని వారికి సూచించారు. కొత్తగా ప్రవేశపెట్టిన వివి పాట్స్ వల్ల సత్ఫలితాలను పొందాలన్నారు. శిక్షణా శిబిరం నిర్వహించిన డ్వామా పి.డి బాపిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో సహాయకుల అవసరమున్నవారిని క్షుణ్ణంగా పరిశీలించి అవసరం మేరకు నిబంధనలను అనుసరించి ఓటింగ్‌కు సహాయకులను అనుమతించాల్సి ఉంటుందని, నిబంధనలను అతిక్రమించరాదని అన్నారు. సంబంధిత ప్రిసైడింగ్ అధికారులు ఎలక్టోరల్ రోల్స్‌ను ఆయా పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలని, అదేవిధంగా ఇవియంలను డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల వద్ద చెకింగ్ చేయరాదని సూచించారు. వివి పాట్స్‌ను సూర్యరశ్మికి లేదా అత్యంత వెలుగుకు దూరంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు ఎన్నికల ప్రక్రియలపై అవగాహన పరీక్ష నిర్వహించారు. ఆ తర్వాత ఇవియంలు, వివి పాట్స్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి కలెక్టర్ ఉమాదేవి, ఐసిడిఎస్ పి.డి సరోజిని తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీ



ఫలసరుకులను అందిస్తున్న డాక్టర్ సి.రోహిణి

గూడూరులోని రెడ్ సంస్థ ఆధ్వర్యంలో, ఆంధ్రమహిళా మండలి, ఇన్నర్‌వీల్‌క్లబ్ సహకారంతో ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ సి.రోహిణి దివ్యాంగులకు ఫలసరుకులు పంపిణీచేశారు. స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో ఈనెల 5న జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొని దివ్యాంగులకు రెడ్‌సంస్థ వారు చేస్తున్న సేవలను అభినందించారు. ఇన్నర్‌వీల్‌క్లబ్ నిర్వాహకులు జీవని, ప్రభారెడ్డిలతో పాటు రెడ్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఛత్రపతి శివాజీ ట్రస్టు సేవలు అభినందనీయం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 5న నెల్లూరు మూలాపేటలోని శివాలయంతోటలో ఛత్రపతి శివాజీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం, వస్త్రదానం సేవలు అభినందనీయమని జిల్లా ఫ్యామిలీ కౌన్సిలింగ్ సభ్యులు బి.బాలచెన్నయ్య పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ సాంస్కృతిక పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ కడివేటి శివాజీరాజా నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కుడుముల సుబ్బారావు, ట్రస్ట్ ఛైర్మెన్ అరవ పూర్ణప్రకాష్, కార్పొరేటర్ యాకశిరి ప్రశాంత్ కిరణ్, అరవ తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విడవలూరు ఎంఇఓ సస్పెన్షన్

గత ఏడాది 33మంది ఉపాధ్యాయులకు సంబంధించిన రూ. 5. 1 లక్షల టిడిఎస్‌ను ఆదాయపన్ను శాఖకు జమ చేయకపోవడం, విధులకు హాజరు కాని ఉపాధ్యాయుడికి జీతం చెల్లింపు, సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించినందుకు నెల్లూరుజిల్లా విడవలూరు ఎంఇఓ గుంజి శైలజను సస్పెండ్ చేస్తూ రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులురెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో యూటిఎఫ్ నేతల ఫిర్యాదు మేరకు విచారించిన అధికారులు ఆర్జేడికి నివేదికను సమర్పించారు. ఈ నేపథ్యంలో ఆమెను సస్పెండ్ చేశారు. ఎంఇఓ సస్పెన్షన్ యూటిఎఫ్ విజయమని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నవకోటేశ్వరరావు, మస్తానయ్యలు ఈ నెల 6న ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# డ్వామా పి.డి బాపిరెడ్డి బదిలీ

జిల్లా నీటి యాజమాన్య సంస్థ(డ్వామా) పి.డిగా వున్న బాపిరెడ్డిని జిల్లా సివిల్ సప్లయిస్ విజిలెన్స్ అధికారిగా బదిలీ చేశారు. ఆత్మకూరు ఆర్డీఓగా వుంటూ నాలుగు నెలల క్రితమే ఆయన డ్వామాకు వచ్చారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇక్కడ నుండి బదిలీచేశారు. ఐసిడిఎస్ పి.డి సరోజనిని ఇన్‌ఛార్జ్ డ్వామా పి.డిగా నియమించారు.



# తుప్పు పట్టిన బోర్లు

## • దాహార్తితో తెరుచుకుంటున్న నోర్లు

నెల్లూరులోని పలు ప్రాంతాల్లో అప్పుడే నీటి కటకట మొదలైంది. వేసవితాపం పెరుగుతున్నకొద్దీ ఈ సమస్య మరింత జటిలం కానుంది. ఇప్పటికే వర్షాభావంతో భూగర్భజలాలు అడుగంటిపోతుండడంతో బావుల్లో నీరు కూడా ఇంకిపోతోంది. అక్కడక్కడా కొన్ని ప్రాంతాల్లో మంచినీటి బోర్లు ఉన్నా అవి ఎంతోకాలంగా మరమ్మత్తులకు గురై ఉండడంతో ఈ ఎండాకాలంలో అవి సరిగా ప్రజలకు ఉపయోగపడడం లేదు. జిల్లావ్యాప్తంగా అనేకప్రాంతాల్లో ఉన్న బోర్లు కూడా నామమాత్రంగానే పని చేస్తున్నాయి. ఎంతోకాలంగా వాటి పర్యవేక్షణను ఆయా ప్రాంతాల్లోని అధికారులు కానీ, సిబ్బంది కానీ పట్టించుకోకపోవడంతో అనేక బోర్లలో నీళ్ళు రాక ప్రజలు నానా బాధలు పడుతున్నారు. కొన్ని గ్రామాల్లో నీటి కోసం మహిళలు ఎంతెంతో దూరం వెళ్ళి ఎక్కడో వ్యవసాయభూముల్లో బోర్లలో నీళ్ళు పట్టుకుని తెచ్చుకోవాల్సి వస్తోంది. దీంతో వారి బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి. జిల్లాలో మంచినీటి ఎద్దడి ముంచుకురాకముందే జిల్లా ఉన్నతాధికారులు ఈ సమస్యలను పరిష్కరించాల్సి ఉంది. ముఖ్యంగా నెల్లూరులోని 32వ డివిజన్‌లో కావేరినగర్, శివాజీనగర్ తదితర ప్రాంతాల్లో బోర్లు తుప్పుపట్టి చెడిపోయి ఉన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయా ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు ప్రాంతాల్లో బోర్లు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. అయినా బోర్లున్నా నీళ్ళు రాకుంటే ప్రయోజనం ఏముంది?..ఎండాకాలం తీవ్రం కాకముందే అధికారులు వెంటనే అన్ని ప్రాంతాల్లోని బోర్ల స్థితిగతులను ఒకసారి క్షుణ్ణంగా పరిశీలించి, అవసరమైనవాటికి వెంటనే మరమ్మతులు చేయించి వాటిని వినియోగంలోకి తెచ్చి ప్రజల దాహార్తిని తీర్చాల్సి ఉంది.

సింహపురి సమాచారం

# ఓం నమః శివాయ!

## నేత్రపర్వంగా మహాశివరాత్రి వేడుకలు

### శివనామస్మరణతో హోరెత్తిన ఆలయాలు



మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా జిల్లావ్యాప్తంగా ఉన్న శివాలయాల్లో శివనామస్మరణలు హోరెత్తిపోయాయి. ఓం నమ:శివాయ, శంభో హర హర మహాదేవ.. అంటూ భక్తులు శివనామాల్ని జపిస్తూ ఈ వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పార్వతీ పరమేశ్వరులకు శోభాయమానంగా అలంకారాలు చేశారు. విశిష్ట సేవలు, విశేష పూజలు నిర్వహించారు. సోమవారం రాత్రి 11 నుంచి 1గంట దాకా అన్ని శైవ క్షేత్రాల్లో పెద్దఎత్తున లింగోద్భవ పూజలు చేపట్టారు. ఈ సందర్భంలో భక్తుల శివ నామస్మరణలతో ఆలయాలు మారుమ్రోగిపోయాయి. ఎక్కడ చూసినా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చి స్వామి అమ్మ వార్లను దర్శించుకుని తరించారు. భక్తులు ఉపవాసాలతో జాగరణ చేశారు. ఈ సందర్భంగా ఆలయాలను విద్యుద్దీపాల తోరణాలతో దేదీప్యమానం చేశారు. అనేక చోట్ల స్వామివార్లకు అంగరంగ వైభవంగా ఊరేగింపులు నిర్వహించారు. జొన్నవాడలోని మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి ఆలయం, సముద్రతీరాన ఉన్న రామతీర్థంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం, సంగంలోని సంగమేశ్వరస్వామి ఆలయం, పంట్రంగంలోని ప్రాచీనమైన పాండురంగేశ్వస్వామి ఆలయం, సోమశిలలోని సోమేశ్వరస్వామి ఆలయం, ఉదయగిరి కొండల్లోని పురాతనమైన ఘటిక సిద్ధేశ్వరాలయం, భైరవకోన ఆలయం, కండలేరు సమీపంలోని కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయం, కావలి, కాటేపల్లి, మైపాడు, గంగపట్నంలలో ఉన్న ప్రసిద్ధమైన శివాలయాలతో పాటు ఇంకా.. మల్లయ్య కోన, సిద్ధులయ్య కోన, తోటపల్లిగూడూరు, ఆత్మకూరు, అల్లూరు, సైదాపురం, సీతారామపురం, రాపూరు, నాయుడుపేట, గూడూరు, మనుబోలు, సూళ్ళూరుపేట, పొదలకూరు, దుత్తలూరు, దొరవారిసత్రం ఇలా జిల్లావ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఉన్న శివాలయాల్లో కొలువైవున్న ఆదిదంపతులకు అత్యంత వైభవంగా పూజలు జరిగాయి.

# నెల్లూరు శివాలయాల్లో ఘనంగా పూజలు..

నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి సందర్భంగా సోమవారం ఉదయం గిన్నెభిక్ష ఉత్సవం, రాత్రి 10 గంటల నుంచి లింగోద్భవాభిషేకం, అర్ధరాత్రి 1 గంట దాకా నందివాహనసేవ వేడుకగా నిర్వహించారు. స్వామి-అమ్మవార్లను అందంగా అలంకరించి నందివాహనంపై కొలువుదీర్చి నగరోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆలయంలో దీపాలను వెలిగించి స్వామివార్లకు పూజలు చేశారు. అనేకమంది ప్రముఖులు, వేలాదిగా భక్తులు ఈ ఉత్సవాల్లో పాల్గొన్నారు. నగరంలోని దర్గామిట్టలో ఉన్న శ్రీ రాజరాజేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో కొలువైవున్న మీనాక్షి సుందరేశ్వరస్వామి ఆలయంలో ఉదయం మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్రహోమం, గిన్నెభిక్ష అలంకారం కన్నులపండువగా నిర్వహించారు. అదేవిధంగా మూలాపేటలోని అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఉదయం గిన్నెభిక్ష ఉత్సవం, రాత్రి నందివాహన సేవ వేడుకగా నిర్వహించారు. మద్రాసు బస్టాండ్ సమీపంలోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి చందనాలంకారం నిర్వహించి, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. నవాబుపేటలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, ఉస్మాన్‌సాహెబ్‌పేటలోని అన్ననపూర్ణ సమేత కాశీవిశ్వనాధస్వామి దేవాలయం, సంతపేటలోని భ్రమరాంబ సమేత హరనాధస్వామి ఆలయం తదితర ఆలయాలన్నిటిలోనూ పార్వతీపరమేశ్వరులకు పూజలు ఎంతో వైభవోపేతంగా జరిగాయి. ఈ మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అనేక ఆలయాల్లో నిర్వహించిన ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.



# వైసిపిలోకి పత్తిబాబు

నెల్లూరు ట్రంకురోడ్డులో సాయినాథ్ ఏజెన్సీస్ అధినేతగానే కాదు, అటు ఆనం ఇటు మాగుంట కుటుంబాలకు అత్యంత సన్నిహితుడు, ఆనం వివేకా ఆప్తమిత్రుడు పత్తి రవీంద్రబాబు అలియాస్ పత్తిబాబు ఈ నెల 5వ తేదీన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. ఈ నెల 5వతేదీన నెల్లూరులో జరిగిన 'సమరశంఖారావం' సభలో వైసిపి అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మాజీమంత్రి ఆనం రామనారా యణరెడ్డిని అనుసరిస్తూ ఆయన వైసిపిలో చేరడం జరిగింది. పత్తిబాబు గతంలో కాంగ్రెస్ నాయకుడిగా వుంటూ కొచ్చిన్ పోర్ట్ డైరెక్టర్‌గానూ, అలాగే నెల్లూరు తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానం ఛైర్మన్‌గానూ సేవలందించివున్నారు.

## కస్తూరిదేవి విద్యార్థినులు..

# బాగా చదువుకుని రాణించాలి

## - పాఠశాల వార్షికోత్సవంలో వక్తలు



సత్కారాన్నందుకుంటున్న దాతలు చంపాలాల్‌జైన్, మోహన్‌లాల్‌జైన్

కస్తూరిదేవి పాఠశాల విద్యార్థినులంతా కష్టపడి చదువుకుని సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని వక్తలు ఆకాంక్షించారు. నెల్లూరులోని ఎంతో ప్రతిష్ఠాత్మకమైన శ్రీ కస్తూరిదేవి పాఠశాల వార్షికోత్సవం ఇటీవల ఘనంగా జరిగింది. పాఠశాల కరెస్పాండెంట్ జెవి రెడ్డితో పాటు 'లాయర్' వారపత్రిక అధినేత తుంగా శివప్రభాత్‌రెడ్డి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శ్రీమతి రాధిక, స్థానిక ప్రముఖులు చంపాలాల్‌జైన్, మోహన్‌లాల్‌జైన్ తదితరులు ముఖ్యఅతిథులుగా పాల్గొని పాఠశాల విద్యార్థినులను ఆశీర్వదించారు. విద్యార్థినులంతా కష్టపడి చదువుకోవాలని, విద్యారంగంలో మరింత ప్రతిభాపాటవాలతో రాణిస్తూ సమాజంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు. అనంతరం, ఈ పాఠశాలకు మంచినీటి సౌకర్యం కలిగిస్తూ వాటర్‌ట్యాంక్ ఏర్పాటు చేసిన దాతలు.. జైన్ సోదరులను జెవి రెడ్డి ఘనంగా సత్కరించారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థినులకు ముఖ్యఅతిథులు చేతులమీదుగా బహుమతులందించారు. విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని వనజతో పాటు ఏ.ఓ నరేష్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# కార్పొరేటర్ పదవికి జడ్.యస్. రాజీనామా!



ఇటీవలే రాష్ట్ర వైద్యఆరోగ్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జడ్.శివప్రసాద్ తన కార్పొరేటర్ పదవికి రాజీనామా చేశారు. జోడు పదవులు వుండకూడదన్న పార్టీ నియమావళిని గౌరవిస్తూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. 6వ తేదీ నెల్లూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం అబ్దుల్ కలాం సమావేశ మందిరంలో జరిగింది. తాను పాల్గొన్న తన చివరి కౌన్సిల్ సమావేశంలో జడ్‌యస్ తన రాజీనామా పత్రాన్ని మేయర్ అబ్దుల్ అజీజ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సహచర సభ్యులు ఆనం రంగమయూర్‌రెడ్డి, బొబ్బల శ్రీనివాసయాదవ్, దాసరి రాజేష్‌కుమార్ తదితరులు జడ్.యస్ గురించి నాలుగు మంచి మాటలు మాట్లాడి ఆయనకు వీడ్కోలు పలికారు. కార్పొరేషన్‌ను, సహచర సభ్యులను వదిలి పోతున్నందుకు డాక్టర్ జడ్.యస్ కొంత ఉద్వేగానికి గురై కంటతడి పెట్టారు.

# ప్రచారంలో వేగం పెంచిన ఆదాల



ఆదాలకు మంగళహారతులు పడుతున్న మహిళలు

నెల్లూరు రూరల్ నియోజకవర్గం తెలుగుదేశం అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి తన ఎన్నికల ప్రచారంలో వేగం పెంచారు. కాళ్లకు బలపాలు కట్టుకున్నట్లు నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలోని పలు గ్రామాలను, అలాగే నగర పరిధిలోని డివిజన్‌లను చుట్టేస్తున్నారు. నేను ఎంపీగా గెలవలేదు, ఈ నియోజకవర్గానికి ఎమ్మెల్యేని కాను... కాని, నాలుగున్నరేళ్లుగా ఈ నియోజకవర్గాన్ని కనిపెట్టుకుని వున్నాను... మీలో తిరిగాను... మీ సమస్యలు తెలుసుకున్నాను, వాటిని పరిష్కరిస్తున్నాను... ఎలాంటి పదవి లేకపోయినా అభివృద్ధిలో నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిపానని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం అభివృద్ధికి, సంక్షేమానికి పెద్దపీట వేసిందని, తెలుగుదేశాన్ని తిరిగి గెలిపించుకుంటేనే ఈ అభివృద్ధి కార్యక్రమాలు మరింత ముందుకు పోతాయన్నారు.

తన ప్రచారంలో భాగంగా ఆదాల 7వ తేదీ నెల్లూరురూరల్‌లోని చంద్రబాబునగర్, టైలర్స్ కాలనీలలో పర్యటించగా స్థానిక ప్రజలు మంగళహారతులతో బ్రహ్మరథం పట్టారు. అలాగే అంతకుముందు రోజుల్లో ఉప్పుటూరు, కందమూరు, బుజబుజనెల్లూరు గ్రామాలలో ఆయన చేసిన ఎన్నికల ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు, కార్యకర్తలు ఆదాల సమక్షంలో తెలుగుదేశంలో చేరారు.



టిడిపిలో చేరిన కార్యకర్తలను కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఆదాల

## ఆదాలకు ఆనం ఆశీస్సులు

స్వర్గీయ ఏ.సి.సుబ్బారెడ్డి కుమారుడు, సీనియర్ రాజకీయవేత్త ఆనం భక్తవత్సలరెడ్డిని ఆదాల ఇటీవల చింతారెడ్డిపాలెంలోని ఆయన నివాసంలో కలుసుకుని ఆయన ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా ఆనం భక్తవత్సలరెడ్డి, ఆయన కుమారుడు ఆనం వెంకటరమణారెడ్డిలు ఆదాలకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

# సందడి చేసిన జనసైన్యం




ప్రజలకు అభివాదం చేస్తున్న పవన్‌కళ్యాణ్

జనసేన అధినేత, పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ఈ నెల 4వ తేదీన నెల్లూరులో పలు చోట్ల రోడ్‌షో నిర్వహించారు. అలాగే పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. కార్యకర్తలనుద్దేశించి తనదైన శైలిలో ఆవేశపూరిత ప్రసంగాలు చేశారు. పవన్ అభిమానులు వేలసంఖ్యలో ఆయనకు స్వాగతం పలికి జిందాబాద్‌లు కొడుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ పర్యటన సందడిగానే సాగింది.

# మెట్టకు విపిఆర్ నీళ్ళు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి

ఈనెల 7వ తేదీన విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంగం మండలం పెరమన, మర్రిపాడు మండలం కంపసముద్రం, కావలి మండలంలోని ఓటూరు, బోగోలు మండలంలోని సుందరగిరి వారి కండ్రిక, విడవలూరు మండలంలోని రామచంద్రాపురం, కొడవలూరు మండలం దామేగుంట, విడవలూరులలో ఏర్పాటు చేసిన ఏడు మినరల్ వాటర్‌ప్లాంట్లను ఫౌండేషన్ సిఇఓ ప్రొ॥ వి.నారాయణరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు ఫౌండేషన్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## సిద్ధలయ్య కోన నుండి

# ఆనం దీవెన యాత్ర



వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైసిపి అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఈ నెల 7వ తేదీన సైదాపురం మండలం సిద్ధలయ్యకోన దేవస్థానంలో పూజలు నిర్వహించారు. అక్కడనుండే ప్రజాదీవెన యాత్రకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమానికి పెద్దసంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు హాజరయ్యారు.

## 'ప్రభా'తం

# దాడులు నేర్పిన పాఠాలు

**పుల్వామా ఉగ్రదాడిని రాజకీయ కోణంలో చూసి... ఈ దాడిని పాకిస్థానే చేయించిందా? చేయించివుంటే అందుకు ఆధారాలేంటి? ఎన్నికలకు ముందే ఈ దాడి జరగడంపై అనుమానాలున్నాయి? ఉగ్ర శిబిరాలపై మన సైనికులు నిజంగానే దాడి చేశారా? అంటూ ప్రశ్నలు వేసిన కాంగ్రెస్, టిఎంసి, తెలుగుదేశం, జనసేన, వామపక్షాల వంటి పార్టీల నేతల తీరు ప్రజలకు వెగటు కలిగించింది. ఓట్ల కోసం దేశ ప్రతిష్ఠను సైతం పణంగా పెట్టే నీచ స్థాయికి నాయకులు దిగిపోయారన్నది వీరి స్టేట్‌మెంట్‌లతో అర్థమైపోయింది.**

పుల్వామా ఉగ్రదాడి... భారత్‌కు ఎన్నో పాఠాలు నేర్పింది. ఎన్నో విషయాలను తెలియజెప్పింది. కొందరి ముసుగులను తొలగించింది. కొందరిపై అనుమానాలను పటాపంచలు చేసింది. ద్రోహులెవరో, దేశ ప్రేమికులెవరో తేల్చిచెప్పింది. మన లోపాలను బయటపెట్టింది. మన శక్తిని ప్రపంచానికి చాటింది. ఈ దాడి పర్యవసానంలో విజయాలున్నాయి, వైఫల్యాలున్నాయి.

పుల్వామా ఉగ్రదాడి ప్రతీకారంగా భారత వైమానిక దళం ఉగ్రశిబిరాలపై చేసిన మెరుపుదాడులు, ఆపై పాక్ యుద్ధ విమానాలు భారత్ భూభాగంలోకి వచ్చి బాంబులు వేయడం, వాటిని తిప్పికొట్టే ప్రయత్నంలో పైలెట్ అభినందన్ పాక్ ఆర్మీకి చిక్కడం, భారత్ దౌత్య ఒత్తిడితో పాకిస్థాన్ అభినందన్‌ను మనకు అప్పగించడం... ఇవన్నీ ముఖ్యఘట్టాలు. ఈ సంఘటనల నేపథ్యంలో భారతదేశంలో ఒక విషయం చాలా స్పష్టంగా కనిపించింది. ఈ సంఘటనల తర్వాత 'హమారా భారత్' అంటూ దేశ వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ముస్లింలు బయటకు వచ్చి స్వచ్ఛందంగా ర్యాలీలు నిర్వహించారు. పాకిస్థాన్ అధ్యక్షుడి దిష్టిబొమ్మలను, పాకిస్థాన్ జెండాలను తగులబెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడ వాళ్ళు ముస్లింలుగా వ్యవహరించలేదు. భారతీయులుగా వ్యవహరించారు. ఇంతకాలం భారతావని కోరుకుంటున్నది కూడా అదే! ఈ దేశంలోని ముస్లింలు కూడా తాము భారతీయులమనే భావనతోనే వుండినారు. కాని, సుదీర్ఘ కాలం ఈ దేశాన్ని పాలించిన పార్టీ వాళ్ళే... వాళ్ళలో మీరు భారతీయులు అనే భావం కంటే కూడా మీరు మైనార్టీలు, ముస్లింలు అనే భావాన్ని నూరిపోశారు. దానిమూలంగానే ఇంతకాలం కూడా దేశ ప్రజలలో ఒకరకమైన అభిప్రాయం ఉండేది. కొందరు ముస్లింలు భారతదేశంలోనే వున్నా పాకిస్థాన్‌పై అభిమానం చూపిస్తారనే అనుమానం వుండేది. ఈరోజు ఆ అనుమానాన్ని తుంచేశారు. ముఖ్యంగా ఈ దేశంలో ఓట్ల కక్కుర్తికి పాల్పడే అవకాశవాద నాయకులకంటే కూడా తాను ఎంతో మేలనిపించుకున్నాడు మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసి. పుల్వామా ఉగ్రదాడి, ఉగ్రశిబిరాలపై భారత వాయుసేనల మెరుపుదాడి అంశాలపై అసదుద్దీన్ ఓవైసీ స్పందించిన తీరు దేశ ప్రజల మన్ననలందుకుంది.

అదే సమయంలో ఓట్ల కోసం, రాజకీయ స్వలాభాల కోసం కొన్ని రాజకీయ పక్షాల నాయకులు వ్యవహరించిన తీరు జుగుప్స కలిగించింది. ఎయిర్ స్ట్రైక్‌తో బీజేపీకి వచ్చే ఎన్నికలలో పాతిక సీట్లు పెరిగాయంటూ కర్నాటక మాజీముఖ్యమంత్రి యడ్యూర్ప చేసిన వ్యాఖ్యలు సైనికుల త్యాగాలను కూడా రాజకీయ ప్రయోజనాలకు వాడుకోవాలనే నీచ మనస్తత్వానికి అద్దంపడుతున్నాయి. అదే సమయంలో పుల్వామా ఉగ్రదాడిని రాజకీయ కోణంలో చూసి... ఈ దాడిని పాకిస్థానే చేయించిందా? చేయించివుంటే అందుకు ఆధారాలేంటి? ఎన్నికలకు ముందే ఈ దాడి జరగడంపై అనుమానాలున్నాయి? ఉగ్రశిబిరాలపై మన సైనికులు నిజంగానే దాడి చేశారా? అంటూ ప్రశ్నలు వేసిన కాంగ్రెస్, టిఎంసి, తెలుగుదేశం, జనసేన, వామపక్షాల వంటి పార్టీల నేతల తీరు ప్రజలకు వెగటు కలిగించింది. ఓట్ల కోసం దేశ ప్రతిష్ఠను సైతం పణంగా పెట్టే నీచ స్థాయికి నాయకులు దిగిపోయారన్నది వీరి స్టేట్‌మెంట్‌లతో అర్థమైపోయింది. విపక్షాల నాయకులందరూ కూడా ప్రధాని నరేంద్రమోడీ మీద పెంచుకున్న ద్వేషాన్ని దేశంపై, దేశాన్ని రక్షించే సైన్యంపై వెళ్లగక్కినట్లయ్యింది. ఏ దేశంలో అయినా దేశం కోసం అక్కడ పార్టీలు, నాయకులు ఏకమవుతారు... కాని భారతదేశంలో పార్టీలు, నాయకులు మాత్రం ఓట్ల కోసం దేశాన్నయినా ముక్కలు చేస్తారని, అవసరమైతే శత్రుదేశం నాయకులను కూడా పొగుడుతారని ఈ సంఘటనల ద్వారా ఋజువైంది. ఏ దేశ మీడియా అయినా మొదట తమ దేశ ప్రయోజనాలకు, దేశ రక్షణకు పెద్దపీట వేస్తుంది. భారతదేశంలో మీడియా మాత్రం తమ అనుకూల పార్టీల రాజకీయ ప్రయోజనాలకు, 'కుల' పార్టీల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిచ్చి దేశ భద్రతను గాలికొదిలేశాయి.

ఇవన్నీ కూడా ఈ సంఘటనల ద్వారా బహిర్గతమైన విషయాలు. అయితే మనం గర్వించాల్సిన విషయాలు ప్రస్ఫుటమయ్యాయి. పాక్‌పై ఉగ్రదాడి విషయంలో ప్రపంచ దేశాలన్నీ భారత్‌కు అండగా నిలిచాయి. అంతర్జాతీయ వేదికలపై పాక్‌ను ఒంటరి చేయడంలో భారత్ విజయం సాధించింది. పైలెట్ అభినందన్ విడుదల విషయంలో పాక్‌కు ఎలాంటి అవకాశమివ్వకుండా భారత ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఒక అగ్రరాజ్యం శాసన విధానాన్ని తలపించింది. నరేంద్ర మోడీ కాళ్లకు బలపాలు కట్టుకుని ఇన్ని దేశాలు ఎందుకు తిరిగాడు అని విమర్శించిన వాళ్ళకు ఇప్పుడు అర్థమైవుంటుంది ఆయన విదేశీ పర్యటనల ఫలితం. ఏ ఒక్క దేశం కూడా ఈ సమయంలో పాక్‌కు తోడు రాలేదు. పాక్‌ను సాకుతున్న చైనా భారత్‌కు వ్యతిరేకంగా వ్యవహరించి వున్నా ఈ విషయంలో మనం ఇబ్బంది పడేవాళ్ళం. కాని, దౌత్య సంప్రదింపులతో చైనాను కూడా దారికి తెచ్చాం. ఆఖరుకు 56 ఇస్లామిక్ దేశాల సదస్సుకు కూడా భారత్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించి, పాకిస్థాన్‌ను వెలివేశారు. ఇంతకంటే దౌత్యవిజయం ఏముంటుంది!...

కేంద్రంలో సంపూర్ణ మెజార్టీ వున్న సుస్థిర ప్రభుత్వమే కాదు, దేశ ప్రయోజనాలు, దేశ భద్రత పట్ల చిత్తశుద్ధి కలిగిన ప్రభుత్వం అధికారంలో వుంటే, దేశమంటే ప్రేమ, దేశ ప్రజల పట్ల అభిమానం వున్న చిత్తశుద్ధి గల చౌకీదార్ ప్రధానిగా వుంటే... భారతదేశం సత్తా ఏ స్థాయిలో వుంటుందన్నది నేడు మనందరం కళ్ళారాచూస్తున్నాం!

## ఎంపిఇవోల సమస్యలపై మంత్రి సానుకూలం

రాష్ట్ర వ్యాప్తంగా తమ సమస్యల పరిష్కారం కోసం గత కొన్నిరోజులుగా శాంతి యుతంగా కార్యక్రమాలు చేపట్టిన ఎంపిఇవోల సమస్యలపై రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఈనెల 2న నెల్లూరు ఆదిత్యనగర్‌లోని ఆయన క్యాంప్ కార్యాలయంలో ఎంపిఇవోలు మంత్రికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం అమలులో ఎంపిఇవోలు చేపట్టిన సమ్మెతో కొన్ని ఇబ్బందులు వచ్చాయన్నారు. రూ. 8వేల జీతాన్ని రూ. 12వేలకు ఇదివరకే పెంచామని, మరో రూ. 3వేలు అందజేస్తామన్నారు. ఇకనుంచి ప్రకృతి వ్యవసాయం క్లస్టర్‌ను పర్యవేక్షించే వారికి అదనంగా మరో రూ. 6వేలు వేతనం లభిస్తుందన్నారు. మహిళా ఉద్యోగులకు 30రోజులు, పురుష ఉద్యోగులకు 15రోజులు ప్రసూతి సెలవులు ప్రకటించామన్నారు. ఈపిఎఫ్‌తో పాటు టిఏ, డిఏలు, హెల్త్‌కార్డుల సౌకర్యం కల్పించామన్నారు. ఎంపిఇవోల సంక్షేమ సంఘం జిల్లా రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

## ప్రజల్ని కంటికి రెప్పలా చూసుకునేది భద్రతాదళాలే!





వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ డిఎస్పీ మల్లికార్జునరావు

ప్రజల్ని కంటికి రెప్పలా చూసుకునేది భద్రతాదళాలు, కమెండోలు, పోలీసులు, త్రివిధ దళాలని నెల్లూరు నగర ట్రాఫిక్ డిఎస్పీ పి. మల్లికార్జునరావు పేర్కొన్నారు. ఈ నెల 4న నెల్లూరు బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధుల ఆశ్రమంలో జరిగిన జాతీయ భద్రతా దినోత్సవం కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ బహువిశాలమైన భారతదేశంలో కోట్లాది మంది ప్రజలు గుండెలపై చేయి వేసుకుని నిద్రపోతున్నారంటే దానికి కారణం భద్రతాదళాలేనన్నారు. అనంతరం వృద్ధాశ్రమం లోని వృద్ధులకు పండ్లు, కేకులు పంపిణీ చేశారు. ట్రాఫిక్ సి.ఐ వేమారెడ్డి, సౌత్ ట్రాఫిక్ సిఐ మధుబాబు, నలుబోలు బలరామయ్య నాయుడు, ఆచార్య ఆదిత్య, పిన్ను గంగాధర్‌రెడ్డి, ఎబి ఆనంద్, పాండు, మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.

## పొగతో.. పరమేశ్వరుని రూపం



నెల్లూరు మూలాపేటకు చెందిన ఉపాధ్యాయుడు, సూక్ష్మ శిల్పి చిత్రకారుడు గంధవళ్ళ ఉమాశంకర్ మహాశివరాత్రిని పురస్కరించుకుని పొగతో పరమేశ్వరుని చిత్రాన్ని రూపొందించాడు. మహాశివ రాత్రి సందర్భంగా ప్రజలందరికి శుభాకాంక్షలు తెలియజేశాడు.




## మీడియా పరువు తీస్తున్నారు

కొన్ని తెలుగు న్యూస్ ఛానెల్స్ చూస్తుంటే పలు అంశాలపై చర్చా వేదికలు నిర్వహిస్తున్నవాళ్ళు తమది మీడియా అని చెప్పుకోవడానికి కూడా అర్హులు కాదనిపిస్తోంది. వీళ్ళు సమాజం, దేశం కంటే కూడా తమకు చెందిన కులం అనే భావానికే ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నట్లుగా వుంది. చర్చావేదికలలో టివి5లో సాంబశివరావు, మహా న్యూస్‌లో మూర్తి, ఏపి 24×7లో వెంకటకృష్ణలు డిబేట్‌లు నిర్వహించే సమయంలో పక్కా తెలుగుదేశం కార్యకర్తలమన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ సొంత పైత్యాన్ని ప్రజలపై రుద్దాలని చూస్తున్నారు.

**- వినుకొండ వాసు, నెల్లూరు.**

## అభిమానం పోయింది

పవన్‌కళ్యాణ్ అంటే నాకు ఎంతో అభిమానం. ఈ ఎన్నికల్లో ఆయనను హీరోగా చూడాలనుకున్నాను. పవన్ కళ్యాణ్ కంటే నా దేశాన్ని ఇంకా ఎక్కువ అభిమానిస్తాను. కాని, ఇటీవల ఎన్నికల సమయంలో యుద్ధం జరుగుతుందని నాకు ముందే తెలుసు, ఉగ్రశిబిరాలపై భారత్ దాడులకు ఆధారాలున్నాయా, గోవులను చంపడం తప్పేలా అవుతుంది అంటూ ఆయన చేసిన పిచ్చి వ్యాఖ్యలతో... ఛీ... ఇంతకాలం నేను అభిమానించింది ఇలాంటి వాడినా అని నా మీద నాకే అసహ్యం వేసింది. అభిమానం స్థానంలో ఆయనంటే అసహ్యం ఏర్పడింది.

**- చక్రధర్.సి నెల్లూరు.**

## సత్తా చాటిన మోడీ

ఎన్ని ఉగ్రవాద దాడులు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎలాంటి ప్రతిచర్యలు ఉండేవి కావు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేస్తే ఎక్కడ ఇక్కడి ముస్లింలు బాధపడతారో, ఎక్కడ ఓట్లు పోతాయో అన్నంత భయంతో వుండేవాళ్ళు. కాని ప్రధాని నరేంద్ర మోడీ ఓట్ల కోణంలో ఆలోచించలేదు. భారత దేశం సత్తా ఏమిటో చూపాలనుకున్నారు. పుల్వామా దాడికి తగిన రీతిలో బుద్ధి చెప్పారు. అంతేకాదు, ఉగ్రశిబిరాలపై చేసిన దాడికి ప్రపంచ దేశాల మద్దతు కూడ గట్టడంలోనూ భారత్‌కు చెందిన పైలెట్‌ను పాక్ చెరనుండి విడిపించడంలోనూ మోడీ ప్రభుత్వం చూపిన చొరవ అభినందనీయం.

**- సి. రాజీవి, నెల్లూరు.**

## జీతాల్లో తేడాలు

నెల్లూరుజిల్లా న్యాయశాఖ కాంట్రాక్ట్ సిబ్బందికి జీతాలు వ్రాయడంలో చాలా వ్యత్యాసాలుంటున్నాయి. వెంకటగిరి, సూళ్లూరుపేట, ఆత్మకూరు, కావలి ట్రెజరీలలో న్యాయశాఖ సిబ్బందికి ఒక స్కేల్ మీద వ్రాస్తున్నారు. హెడ్‌క్లర్క్‌కు కరెక్ట్‌గా వ్రాస్తున్నారు. కోవూరు ట్రెజరీలో కాంట్రాక్ట్ సిబ్బందికి ఇంకో విధంగా వ్రాస్తున్నారు. ఈ లోపాలపై జిల్లా ఖజానా అధికారి మోహన్ దృష్టి సారించాలి.

**కె. సావిత్రి, వెంకటగిరి.**

• జిల్లా 'దేశం'లో

# కొన్ని చోట్ల క్లియరెన్స్

## ఒకటి రెండు చోట్ల న్యూసెన్స్









జిల్లాలోని పది అసెంబ్లీలకుగాను పలు స్థానాలలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఖరారయ్యారు. గతంలోనే నెల్లూరు నగరానికి మంత్రి పి.నారాయణను, నెల్లూరు రూరల్‌కు మాజీమంత్రి ఆదాల ప్రభాకర్‌రెడ్డిని, సర్వేపల్లికి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని ఖరారు చేయగా ఆ తర్వాత గూడూరుకు సిటింగ్ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌ను, వెంకటగిరికి సిట్టింగ్ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను, ఆత్మకూరుకు బొల్లినేని కృష్ణయ్యను, కోవూరుకు పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డిని ఖరారు చేశారు.

ఇక సూళ్లూరుపేట, కావలి, ఉదయగిరి సీట్లే తేలాల్సివుంది. సూళ్లూరుపేటలో మాజీమంత్రి పరసా రత్నం వున్నప్పటికీ ఈసారి పోటీకి ఆయన సరిపోడనే ప్రచారం ఎక్కువగా వుంది. పార్టీలో ఎక్కువ మంది ఆయన అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తున్నారు కూడా! ఆయనను కాదంటే ఎవరికివ్వాలో ఇంకా అర్ధంకాని పరిస్థితి సూళ్లూరుపేట టీడీపీలో నెలకొంది.

కావలి టిడిపికి అయితే బీద మస్తాన్‌రావుకు మించిన అభ్యర్థి లేడు. సోమిరెడ్డి, నారాయణ, ఆదాలతో పాటే కావలికి బీదను ప్రకటించివుండాలి. కాకపోతే బీద మస్తాన్‌రావును నెల్లూరు లేదా ఒంగోలు పార్లమెంటుకు పంపించాలనే ఆలోచనలో చంద్రబాబు వున్నట్లు తెలుస్తోంది. బీదను లోక్‌సభకు పంపించి, వైసిపికి రాజీనామా చేసిన మాజీఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డికి కావలి సీటు ఇవ్వాలనే ప్రతిపాదన వుంది. మరి బీద మస్తాన్‌రావు కావలిని వదులుకుంటాడా?

ఉదయగిరిలో మాత్రం సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావును మార్చడం మాత్రం ఖాయమనిపిస్తోంది. ఆయన మీద పలు అవినీతి ఆరోపణలు రావడంతో పాటు, నియోజకవర్గంలో మెజార్టీ నాయకులు ఆయనకు మళ్లీ సీటు ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నారు. దీంతో ఆయన బదులు 'రెడ్డి' సామాజికవర్గం నుండి అభ్యర్థిని దించాలనే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే మాజీఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిల పేర్లు పరిశీలనలో వున్నట్లు తెలుస్తోంది.

# తిరుగుబాట్లు తప్పవా?






జిల్లాలో ఒక ఎంపి, పది అసెంబ్లీ స్థానాలకు ఇంకా అభ్యర్థుల ఎంపిక పూర్తికాలేదు. ఇరు పార్టీలలో కొన్ని సీట్లకు అభ్యర్థులు ఖరారయ్యారు. టిక్కెట్లు రానివాళ్ళు ఈసారి తమ పార్టీలపై తిరుగుబాటు జెండా ఎగురవేసే ఆలోచనలో వున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ తిరుగుబాటుదారులు వైసిపిలో కంటే కూడా తెలుగుదేశం పార్టీలోనే ఎక్కువగా వుండడం గమనార్హం.

వైసిపిలో ఒక్క కావలి సీటు విషయంలో తప్పితే ఎక్కడా అలకలు లేవు, తిరుగుబాట్లు లేవు. వెంకటగిరి సీటు లేదని తెలిసి ఇంతకుమునుపే జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి వైసిపికి రాజీనామా చేసేసున్నాడు. ఇప్పుడు కావలిలో తాము వద్దంటున్నా సిటింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి సీటిస్తున్నారని చెప్పి మాజీఎమ్మెల్యేలు కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, వంటేరు వేణుగోపాలరెడ్డిలు అలిగి వైసిపికి రాజీనామా చేశారు.

ఉదయగిరిలో మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి సీటివ్వొద్దంటూ కొందరు మండలస్థాయి నాయకులు పోరాడుతున్నారు. అయితే ఈ సీటు నాకే కావాలని ఇంకే వైసిపి నాయకుడు కూడా బలంగా పట్టుబట్టడం లేదు. కాబట్టి ఇది పెద్ద సమస్య కాదు.

తెలుగుదేశంలో చూస్తే... కోవూరు సీటును పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి ఇవ్వడంతో పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

ఉదయగిరిలో సిటింగ్ ఎమ్మెల్యే బొల్లినేని రామారావుకే మళ్ళీ సీటిస్తే ద్వితీయశ్రేణి నాయకులు చాలామంది పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే అవకాశాలు లేకపోలేదు.

గూడూరు, ఆత్మకూరు నియోజకవర్గాలలోనూ తెలుగుదేశంలో అసమ్మతి స్వరాలు, తిరుగుబాట్లు ఎక్కువే వుండొచ్చు.

• అన్ని పార్టీల్లోనూ...

# మహిళలకు మంగళమేనా?


టి.అనూరాధ


జ్యోత్స్నలత

రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వచ్చేసింది. టిక్కెట్ల సందడి మొదలైంది. ఆశావహులు తమ జాతకాలు పట్టుకుని తిరుగుతున్నారు. జిల్లా వ్యాప్తంగా పలు నియోజకవర్గాలకు ప్రధాన పార్టీల తరఫున పలువురు అభ్యర్థులు ఖరారయ్యారు. మిగిలిన స్థానాలలోనూ ఇంకా కొందరి నాయకుల పేర్లు ప్రచారంలో షికారు చేస్తున్నాయి. విచిత్రమేంటంటే ఈ పేర్లలో మహిళల పేరే మచ్చుకైనా కనిపించడం లేదు. ఓ పక్క చట్టసభలలో మహిళలకు 33శాతం రిజర్వేషన్‌ల బిల్లు ఆమోదం పొందలేదని గగ్గోలు పెడుతున్నారు. ఇక్కడ చూస్తే జిల్లాలోని 10అసెంబ్లీ సీట్లలో ఒక్క అసెంబ్లీ స్థానంలో కూడా మహిళా నాయకుల పేర్లు వినిపించడం లేదు.

వైసిపిలో ఒక్కరికి కూడా మహిళకు సీటిచ్చే వాతావరణం కనిపించడం లేదు. 10 అసెంబ్లీలకు కూడా దాదాపు అభ్యర్థులు ఫిక్సయ్యారు. 2014లో కూడా జిల్లాలో వైసిపి తరఫున ఒక్క మహిళకు కూడా సీటివ్వలేదు. ఈసారి తెలుగుదేశంలో కూడా మహిళలకు మొండి చేయి చూపించే పరిస్థితే కనిపిస్తోంది. ఇప్పటికే ఏడు అసెంబ్లీకు వాళ్ళు దాదాపు అభ్యర్థులను ఖరారు చేశారు. మిగిలిన స్థానాలలో కూడా మహిళలకు అవకాశాలు కనిపించడం లేదు.

జిల్లాలో 1989 నుండి కూడా అటు కాంగ్రెస్ గాని, ఇటు తెలుగుదేశం గాని మహిళలకు కనీస ప్రాధాన్యత కల్పిస్తూ వచ్చాయి. 1989లో కుడుముల పద్మశ్రీ నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా గెలిచింది. 1992లో పనబాక లక్ష్మి వచ్చి నెల్లూరు నుండే కాంగ్రెస్ ఎంపీగా విజయం సాధించింది. 1996లోనూ 1998లోనూ పనబాక లక్ష్మి మళ్ళీ ఎంపీగా గెలిచింది. 1999 ఎన్నికల్లో నెల్లూరు లోక్‌సభ నుండి కాంగ్రెస్ అభ్యర్థిగా పనబాకలక్ష్మికి సీటివ్వగా తెలుగుదేశం తమ అభ్యర్థిగా ఉక్కాల రాజేశ్వరమ్మను నిలబెట్టింది. అదే ఎన్నికల్లో వెంకటగిరి అసెంబ్లీకి కాంగ్రెస్ పార్టీ నేదురుమల్లి రాజ్యలక్ష్మిని దించగా, తెలుగుదేశం వెంకటగిరి నుండి సినీ నటి శారదకు సీటిచ్చింది. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపి సీటుకు పనబాకలక్ష్మితో పాటు వెంకటగిరి అసెంబ్లీని రాజ్యలక్ష్మికి, కావలి సీటును మాగుంట పార్వ తమ్మకు ఇవ్వగా... తెలుగుదేశం గూడూరు అసెంబ్లీని ఉక్కాల రాజేశ్వరమ్మకు కేటాయించింది. 2009 ఎన్నికల్లోనూ వెంకటగిరి నుండి రాజ్యలక్ష్మి, సూళ్లూరుపేట నుండి రాజసులోచనలు కాంగ్రెస్ అభ్యర్థులుగా దిగారు. ఆ ఎన్నికల్లో టిడిపి నుండి మాత్రం మహిళా అభ్యర్థులు లేరు. 2014లో మాత్రం గూడూరు అసెంబ్లీ సీటును తెలుగుదేశం వాళ్ళు డాక్టర్ బి.జ్యోత్స్నలతకు ఇచ్చారు.

ఇలా 1989 ఎన్నికల నుండి కూడా ప్రతి ఎన్నికలలోనూ ప్రధానమైన రెండు పార్టీల తరఫున ఎక్కడోచోట మహిళా అభ్యర్థులు వుంటూవచ్చారు. కాని ఈసారి ఎన్నికలను చూస్తే ఒక్కచోట కూడా ప్రధాన పార్టీల తరఫున మహిళా అభ్యర్థులను నిలబెడతారన్న ఆశలు లేవు.



# స్వర్ణాల చెరువును రాజకీయం చేయొద్దు



నెల్లూరులోని స్వర్ణాల చెరువును నెక్లెస్ రోడ్డు పేరుతో అభివృద్ధి చేయడం వరకు బాగానే వుంది. కాని ఈ చెరువును కేంద్రంగా చేసుకుని ఓట్ల కోసం కొంత మంది రోత రాజకీయాలు చేయడం వికారంగా వుంది. ఓట్ల కోసం అధికార పార్టీ నాయకులు ప్రధాన మతాల ప్రజల మధ్య లేని పోని అపోహలు సృష్టిస్తున్నారు. స్వర్ణాల చెరువుకు ఓ పక్క గ్రామ దేవత ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం వుంది. తూర్పు పక్క బారాషహీద్ దర్గా వుంది. ఇంతవరకు సరే... స్వర్ణాల చెరువులో శివ లింగాన్ని ప్రతిష్టించాలని ఆ మధ్య నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శీనయ్య ప్రయత్నాలు చేశాడు. దీనిని వ్యతిరేకిస్తూ ముస్లింలు దర్గా ఆవరణలో జెండాలు నాటారు. ఇవి చాలదన్నట్లు ఇప్పుడు చెరువు వద్ద ఓ మతానికి సంబంధించిన ఘాట్ కడతారట. ఇప్పటికే జరిగిన రచ్చ చాలు. స్వర్ణాల చెరువు పక్కన గతంలో ఎలా వుందో అలాగే వుంచండి. కావాలంటే టూరిజం పరంగా ఎంతైనా అభివృద్ధి చేయండి. కాని ఓట్ల కోసం వివిధ వర్గాల ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయవద్దు.

## నెరవేరని ఆశ



2019 ఎన్నికల్లో అసెంబ్లీకి పోటీ చేయాలనుకున్న మేయర్ అబ్దుల్ అజీజ్ ప్రయత్నం నెరవేరలేదు. 2014లో వైసిపి పార్టీ నుండి మేయర్‌గా గెలిచి వెనువెంటనే తెలుగుదేశంలో చేరడం తెలిసిందే! 2019 ఎన్నికల్లో మైనార్టీ కోటా నుండి నెల్లూరు సిటీ లేదా రూరల్ నియోజకవర్గాలలో ఎక్కడో చోట పోటీ చేయాలనుకున్నాడు. నెల్లూరు సిటి నుండి మంత్రి నారాయణ తాను పోటీ చేయడం కోసం అజీజ్‌కు రూరల్ సీటు ఆశ పెట్టాడు. అయితే చివరకు ఆ సీటును ఆదాల ప్రభాకర్‌రెడ్డికి ఖరారు చేయగా, అజీజ్‌కు ఈసారి కూడా ఎమ్మెల్యే పోటీ ఛాన్స్ లేకుండా పోయింది. ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వలేకపోయినందుకు ప్రతిఫలంగా అజీజ్‌కు ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. ఆ విధంగా మైనార్టీలను సంతృప్తి పరచాలనుకున్నారు. అయితే మొన్న ఎమ్మెల్యేల కోటాలో ఐదు ఎమ్మెల్సీలను భర్తీ చేయగా, అందులో అజీజ్‌కు స్థానం లేకుండా పోయింది. ఇక ఏదన్నా వుంటే ఎన్నికల తర్వాతే! అప్పుడు ఏ పార్టీ అధికారంలో వుంటుందో? ఏమో?

## చాట్లకు మళ్ళీ అదే పదవి



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్‌గా వరుసగా రెండోసారి చాట్ల నరసింహారావునే నియమించారు. దీనికి సంబంధించి 5వ తేదీ ఉత్తర్వులు వచ్చాయి. తొలిసారి 2016 ఫిబ్రవరి 18న చాట్లను ఈ పదవిలో నియమించారు. ఈ పదవిలో మూడేళ్ళు పూర్తి కావడంతో మంత్రి నారాయణ సహకారంతో మళ్ళీ అదే పదవి ఆయనను వరించింది.


## యోగా ఛాంపియన్‌కు నగదు పురస్కారం



నెల్లూరుకు చెందిన అంతర్జాతీయ యోగా ఛాంపియన్ ఏకాంబరం జ్యోష్ణవికి రాష్ట్ర ప్రభుత్వం 5లక్షల నగదు బహుమతి ప్రకటించింది. ఈ మేరకు 5వ తేదీ కేబినెట్ ఆమోదం తెలిపింది. జ్యోష్ణవి పలు అంతర్జాతీయ యోగా వేదికలపై అద్భుతంగా రాణించి ఎన్నో బంగారు పతకాలు అందుకుంది. యోగాలో రాష్ట్రం పేరును నిలబెట్టింది. గతంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం రోజున జ్యోష్ణవి యోగాసనాలను చూసి సీఎం చంద్రబాబునాయుడు ఆశ్చర్యపోవడమే కాక ప్రత్యేక అభినందనలు తెలిపారు. అప్పుడే పాతికలక్షల నగదు బహుమతి కూడా ప్రకటించారు. ఆమె ప్రతిభను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆమెను మరోసారి నగదు బహుమతితో సత్కరించనుంది.

## నెల్లూరు కబుర్లు

### ఎంపి విజయసాయిరెడ్డికి ఓ క్రీడా సంఘం పదవి



సోషల్ మీడియా ద్వారా వ్యంగ్యోక్తులు, పదునైన విమర్శలతో ప్రతిరోజూ తెలుగుదేశం నాయకులతో ఆడుకునే రాజకీయ క్రీడాకారుడు, రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి కూడా ఓ క్రీడా సంఘానికి అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. 5వ తేదీన నెల్లూరులోని హరిత హోటల్‌లో ఏ.పి. స్క్వాష్ రాకెట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరుగగా ఆ సభలో విజయసాయిరెడ్డిని ఈ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ప్రధాన కార్యదర్శిగా రాజీవ్‌రెడ్డిని, కోశాధికారిగా ఏ.మహేష్‌కుమార్ రెడ్డిని ఎన్నుకున్నారు. స్క్వాష్ రాకెట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి రాజేంద్రన్, ఏపి ఒలంపిక్స్ అసోసియేషన్ ప్రతినిధి బడేటి వెంకట్రామయ్య, ప్రధానకార్యదర్శి ఆర్.కె.పురుషోత్తం పర్యవేక్షణలో ఈ ఎన్నిక జరిగింది.

### మిస్టర్ ఆంధ్రా పోటీల్లో సత్తాచాటిన నెల్లూరీయులు



బాడీబిల్డింగ్ పోటీలలో గెలుపొందిన క్రీడాకారులు

మిస్టర్ ఆంధ్రా పోటీలో నెల్లూరీయులు తమ సత్తా చాటుకున్నారు. ఈనెల 3 నుంచి పాలకొల్లులో జరిగిన ఈ పోటీల్లో 85 కేజీల విభాగంలో పి.షబ్బీర్ ఖాన్ బంగారు పతకాన్ని, అఖిల్ వెండి పతకాన్ని సాధించారు. 55 కేజీల విభాగంలో అనిజిత్ కాంస్య పతకం సాధించాడు. పతకాలు సాధించిన వీరిని ఇటీవల నెల్లూరులోని జిల్లా అమెచ్యూర్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పవన్‌కుమార్ తదితరులు అభినందించారు.

## మైపాడు రోడ్డును విస్తరించేదుందా?

నగరంలో పాత చెక్‌పోస్ట్ నుండి మైపాడు గేటు వరకు మైపాడురోడ్డు ఆక్రమణలకు గురైంది. కొన్నేళ్ల క్రితం ఈ రోడ్డుపై పెద్దగా ట్రాఫిక్ వుండేది కాదు. కాని, ఇప్పుడు ట్రాఫిక్ రద్దీ పెరిగింది. రోజూ కొన్ని వేల వాహనాలు ఈ రోడ్డు మీద తిరుగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు దండిగా వున్నాయి. ఈ ఆక్రమణలలో నివసిస్తున్న వారి పిల్లలు రోడ్డు మీదకే వచ్చి ఆటలాడుతుండడం, తిరుగుతుండడం చేస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశముంది. ఈ రోడ్డు పక్కనే జంతు అవశేషాలకు చెందిన వ్యాపారాలు కూడా నిర్వహిస్తుండడంతో ఈ రోడ్డున పోయే జనాలు దుర్వాసనను తట్టుకోలేకపోతున్నారు. ఈ రోడ్డును విస్తరించడానికి కావాల్సినంత స్థలముంది. ముందు పాత చెక్‌పోస్టు నుండి మైపాడు గేటు వరకు ఈ రోడ్డు విస్తరణను చేపట్టాల్సి వుంది.

## ఎంఆర్‌పికి తూట్లు

మద్యం ధరలు మళ్ళీ మోతెక్కబోతున్నాయి. మద్యం వ్యాపారులంతా మళ్ళీ సిండికేట్ అయ్యారు. ఎంఆర్‌పి రేట్లకు మంగళం పాడారు. ఎన్నికల సీజన్ కావడంతో మద్యం వ్యాపారులకు కోలుకోవడానికి ఒక్క ఛాన్స్ ఇద్దామనే ఆలోచనలో ఎక్సైజ్ అధికారులు కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారు. వాస్తవానికి గత రెండేళ్లుగా మద్యం వ్యాపారులు అంత ఆనందంగా ఏమీ లేరు. లీజులు తగ్గినా నిర్వహణ వ్యయంతో పాటు లంచాలు కూడా బాగా పెరిగాయి. లంచాల దెబ్బకు తట్టుకోలేక మద్యం వ్యాపారులే అధికారులను ఏసిబికి పట్టించిన సందర్భాలున్నాయి. కనీసం ఈ ఎలక్షన్‌తోనన్నా నాలుగు రూపాయలు వెనకేసుకుందామనే ఉద్దేశ్యంతో మద్యం వ్యాపారులున్నారు.


## ఇళ్ళ పన్ను వసూళ్ళ లక్ష్యం నెరవేరేనా?

ఇంటి పన్నుపై వడ్డీ మాఫీ చేస్తూ ప్రభుత్వం జి.ఓ జారీ చేయడం తెలిసిందే! కార్పొరేషన్ పరిధిలో 2లక్షల దాకా వాణిజ్య, నివాస గృహాలుండగా, లక్షా 20వేల అసెస్‌మెంట్ల వరకే పన్నులు వసూలు చేస్తున్నారు. వీటికి సంబంధించి 33.10కోట్ల పాత బకాయిలుండగా, వాటి మీద వడ్డీలే 40.39 కోట్లు అయ్యాయి. వడ్డీతో కలిపి ఇంటి పన్ను కట్టాలంటే ప్రతి ఒక్కరికీ వాచిపోతుంది. అందుకే వడ్డీ మాఫీ చేశారు. అయితే ఈ నెల 31వ తేదీ లోపు కట్టిన వాళ్ళకే వడ్డీ మాఫీ వర్తిస్తుంది. మరి ఈ నెలాఖరులోపు కార్పొరేషన్ వారి పన్నుల వసూళ్ళ లక్ష్యం ఎంతవరకు నెరవేరుతుందో చూడాలి!

## గుండుసూదిపై సూక్ష్మ శివలింగం



షేక్ ముసవ్వీర్



గుండుసూదిపై సూక్ష్మ శివలింగం

నెల్లూరు జెండావీధికి చెందిన స్వర్ణకారుడు డా॥ షేక్ ముసవ్వీర్ గతంలో అనేక వెండి, స్వర్ణంతో సూక్ష్మ రూపాలను తయారుచేసి అందరి ప్రశంసలు అందుకొన్నాడు. ఈసారి మహాశివరాత్రిని పురస్కరించుకుని 20మిల్లీగ్రాముల బంగారంతో సూక్ష్మ శివలింగాన్ని తయారుచేసి గుండుసూది పైభాగమున ఉంచి ప్రజలందరికి మహాశివరాత్రి శుభాకాంక్షలు తెలియజేశాడు.

## మసీదు నిర్మాణ పనులు పరిశీలించిన మంత్రి

నెల్లూరు దర్గామిట్ట బారాషాహీద్ దర్గా ఆవరణంలో నిర్మిస్తున్న మసీదు నిర్మాణ పనులను ఈనెల 2న రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ, నగర మేయర్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దర్గా ఆవరణంలో నిత్యం 20వేల మంది నమాజులు చేసుకునే విధంగా మసీదు నిర్మాణం పనులు చేపడుతున్నామన్నారు. దర్గాలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. కోటమిట్టలో దాదాపు రూ.8కోట్లతో నిర్మిస్తున్న అత్యాధునిక షాదీమంజిల్‌ను త్వరలో పూర్తి చేస్తామన్నారు. మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, వక్ఫ్‌బోర్డు ఛైర్మెన్ మున్వర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ళ శాఖకు అవార్డు



జిల్లా కలెక్టర్‌కు అవార్డును చూపుతున్న అధికారులు

2019-20 సంవత్సరానికిగాను జిల్లా గృహ నిర్మాణ సంస్థకు ప్రతిష్టాత్మకమైన స్కాచ్ ఆర్డర్ ఆఫ్ మెరిట్ బ్రాంజ్ అవార్డు వచ్చింది. ఢిల్లీలోని స్కాచ్ గ్రూప్ నుండి హౌసింగ్ పి.డి ఎస్.వి.ఆర్.ప్రసాద్ ఇటీవల ఈ అవార్డ్ అందుకున్నారు. గృహనిర్మాణానికి సంబంధించి జిల్లా గృహనిర్మాణ శాఖ చూపిన పని తనానికిగాను జిల్లా హౌసింగ్ శాఖను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. హౌసింగ్ శాఖ అధికారులు ఈ అవార్డును కలెక్టర్ ముత్యాలరాజు వద్దకు తీసుకొచ్చి చూపించి ఆయనతో తమ ఆనందాన్ని పంచుకున్నారు.

## విశ్రాంత పోలీస్ అధికారులకు ఎస్పీ భరోసా

విశ్రాంత పోలీస్ అధికారులకు ఎమైనా సమస్య లుంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని జిల్లా ఎస్పీ ఐశ్వర్య రస్తోగి పేర్కొన్నారు. వారి సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ నెల 2న నెల్లూరు ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో విశ్రాంత పోలీసు అధికారుల సంఘ సమావేశం జరిగింది. పలు అంశాలను విశ్రాంత పోలీస్ అధికారులు ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. ఇళ్ల స్థలాలు, ఇంక్రిమెంట్లు అరియర్స్‌ను త్వరితగతిన ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఎస్పీని అసోసియేషన్ నాయకులు శాలువతో సత్కరించారు. విశ్రాంత పోలీస్ అధికారుల సంఘ రాష్ట్ర అధ్యక్షులు బాషా ఏఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు మోహన్‌రావు, కార్యదర్శి శౌరిరెడ్డి, ఉపాధ్యక్షులు వాసుదేవయ్య, అల్లాబక్షు, సహాయకార్యదర్శి సుబ్బారెడ్డి, కోశాధికారి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

## రెవెన్యూలో సస్పెన్షన్ల సందడి

భూముల వివరాలకు సంబంధించి తప్పుడు నివేదికలను అందజేసినందుకుగాను గత దగదర్తి తహశీల్దార్ జయప్రకాశ్, డిప్యూటి తహశీల్దార్ మీనాకుమారి, వీఆర్‌ఓ భక్తవత్సలంలను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేశారు. అలాగే గత కావలి ఆర్డీఓ నరసింహంపై చర్యకు ప్రభుత్వానికి నివేదిక పంపారు. దగదర్తి మండలం దామవరం గ్రామంలో భూముల వివరాలలో నివేదికలను రూపొందించడంలో అవకతవకలకు పాల్పడినందువల్లే వీరిపై వేటేసారని తెలుస్తోంది.



పార్టీలో చేరిన వారితో మంత్రి సోమిరెడ్డి

# అభివృద్ధిని చూసే టిడిపిలో చేరుతున్నారు

## - సోమిరెడ్డి

గత ఐదేళ్లలో మేం చేసిన అభివృద్ధి పనులను చూసే ప్రజలు తెలుగుదేశం పార్టీకి మద్దతు పలుకుతున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 6వ తేదీన మనుబోలు మండలం మడమనూరు గ్రామంలో 150కిపైగా కుటుంబాల వారు తెలుగుదేశంలో చేరారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వారందరికీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతుల దశాబ్దాల కల అయిన దేగపూడి-బండేపల్లి కాలువను సాకారం చేస్తున్నామని, ఈ కాలువ ద్వారా మడవ తీస్తే సుమారు 15వేల ఎకరాలకు నీళ్ళు పారే అవకాశముందన్నారు. చరిత్రలో కనీవిని ఎరుగని అభివృద్ధి ఈ 5ఏళ్ల తెలుగుదేశం పాలనలో సాధ్యమైందన్నారు.

కండే రాగయ్య, ఖాదర్ బాషా, బాలాజీ కృష్ణయ్య, ఆవుల పరంధామయ్య, ఆవుల వెంకటయ్య, చెడమల రామయ్య, మేకల చెంచయ్య, అన్నంగి కిరణ్, అన్నంగి పవన్, కురుగొండ రమణయ్య, నాగరాజు తదితరులు మంత్రి సమక్షంలో పార్టీలో చేరారు.

# అనిల్‌కు మీ ఆశీస్సులు అందించండి

## - రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఈ నెల 6వ తేదీన నెల్లూరు 9వ డివిజన్ బాలాజీనగర్‌లోని నెల్లూరు నగరపాలక సంస్థ పత్తివారి ఉన్నత పాఠశాలలో గంటకు వెయ్యి లీటర్ల తాగునీటిని శుభ్రపరిచే సామర్థ్యంతో విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్‌ప్లాంట్‌ను రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయడానికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్ ఎంతో చొరవ చూపారని, నిత్యం ప్రజల మధ్యలో వుంటూ ప్రజల సమస్యలను తీర్చడంలో ముందుండే అనిల్‌ను ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. తన చేతుల మీదుగా ఈ వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించడం ఎంతో ఆనందం కలిగిస్తోందన్నారు. రాబోయే రోజుల్లో కూడా తన ఎంపి ల్యాడ్స్ నుండి ఈ పాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తానని చెప్పారు. ఈ ఆర్.ఓ ప్లాంట్ నిర్వహణ రెండేళ్ళపాటు విపిఆర్ ఫౌండేషనే చూసుకుంటుందని



విపిఆర్‌కు అభినందనలు తెలుపుతున్న స్కూల్ విద్యార్థినులు

అన్నారు. వైసిపి అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పోరాటస్ఫూర్తితో ప్రతి కార్యకర్త వచ్చే ఎన్నికల్లో వైసిపి విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్‌తో పాటు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, కార్పొరేటర్ దామవరపు రాజశేఖర్, విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి, కో-ఆర్డినేటర్ శంకర్, పిఆర్‌ఓ జిఎం రాజేశ్వరరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ జాస్మీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

# మరో 8 గ్రామాలకు విపిఆర్ అమృతధార



ఆర్‌ఓ ప్లాంట్‌ను చిన్నారితో కలిసి ప్రారంభిస్తున్న విపిఆర్

జిల్లాలో విపిఆర్ ఫౌండేషన్ ద్వారా ఏర్పాటుచేసిన 8 విపిఆర్ అమృతధార పథకాలను (ఆర్‌ఓ ప్లాంట్‌లను) రాజ్యసభ సభ్యులు, ప్రముఖదాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల 3న ప్రారంభించారు. సూళ్ళూరుపేట నియోజకవర్గంలోని పెళ్ళకూరు మండలం పునబాక గ్రామంలోను, చిల్లకూరు మండలంలోని చిల్లకూరు, జంగాలపల్లి గ్రామాల్లోను, వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలంలో ఉన్న భైరవరం, ఎన్‌సి కండ్రిగ గ్రామాల్లోను, సర్వేపల్లి నియోజకవర్గంలోని మనుబోలు మండలం బద్దెవోలు, వెంకటాచలం మండలంలోని కొండకింది ఎస్సీ కాలనీలోను, తోటపల్లిగూడూరు మండలంలోని వెంకన్నపాళెంలలో ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్స్‌ను ఆయన ప్రారంభించారు.

# జగనన్నతోనే జనరంజక పాలన!

## - నెల్లూరు ఎమ్మెల్యే డా. అనిల్

రాష్ట్ర ప్రజల భవిష్యత్ కోసమే డా. వైయస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాలను ప్రకటించారని, జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతారని నెల్లూరు నగర ఎమ్మెల్యే డాక్టర్ పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ చెప్పారు. ఈనెల 3న ఉస్మాన్‌సాహెబ్‌పేటలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగరంలోని 10వ డివిజన్‌కు చెందిన దండు హర్షారెడ్డి ఆధ్వర్యంలో 160 మంది యువకులు, గిరిజమ్మ ఆధ్వర్యంలో మరో 40 మంది ఎమ్మెల్యే డా.అనిల్ సమక్షంలో వైయస్సార్సీపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌ను సిఎం చేసుకోవాలనే సంకల్పంతో అనేకమంది వైయస్సార్సీపిలో చేరుతుండడం సంతోషకరమన్నారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉంటూ ప్రజల పక్షాన తానెన్నో పోరాటాలు, ఎన్నో సేవా కార్యక్రమాలు చేశానన్నారు. మంత్రి పదవి వచ్చినప్పటి నుంచి ప్రజల కోసం ఏనాడూ పట్టించుకోని నారాయణ, ఇప్పుడు ఎన్నికలు వస్తున్నాయి కనుక హడావిడిగా శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేస్తూ నాటకాలాడుతున్నారని ఆయన విమర్శించారు.




పార్టీలో చేరిన యువకులు, మహిళలతో ఎమ్మెల్యే అనిల్

ఈ కార్యక్రమంలో పార్టీలో చేరిన దండు హర్షారెడ్డి, ఆల్బెన్, జగదీష్, పవన్, మహేష్, గిరిజమ్మ తదితరులతో పాటు డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్, నాయకులు ఉప్పాల శేషగౌడ్, గుణ, శేఖర్, రాజా, గూడూరు శ్రీధర్‌రెడ్డి, కొండారెడ్డి, గోవింద్, టి.వినీల్ తదితరులు పాల్గొన్నారు.



ఈ నెల 3వ తేదీన నెల్లూరులో జరిగిన జగన్ డిగ్రీ కాలేజీ 19వ వార్షికోత్సవంలో పాల్గొని వివిధ పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేస్తున్న ఎంపి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతిరెడ్డి, పక్కన మధుసూధనరెడ్డి, మమత, రమేష్ తదితరులు

# శ్రీసిటిలో బ్రహ్మాండంగా భద్రతా వారోత్సవాలు

జాగ్రత్త లేకుంటే ప్రతి పనిలోనూ ప్రమాదం పొంచి ఉన్నట్లేనని, రోడ్డు ప్రమాదాలైనా, పారిశ్రామిక ప్రమాదాలైనా ఎక్కువగా అజాగ్రత్త, నిర్లక్ష్యం వల్లనే జరుగుతుంటాయని, ఇలాంటి ప్రమాదాలు తగ్గాలంటే అందరూ తమ వృత్తుల్లో భద్రతా నిబంధనలు తప్పకుండా పాటించాలని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. శ్రీసిటీలో జరుగుతున్న జాతీయ భద్రతా వారోత్సవాలు ఈనెల 4తో ముగిశాయి. ఈ ఉత్సవాల ముగింపు సందర్భంగా శ్రీసిటీలో బిజినెస్ సెంటర్ వద్ద సేఫ్టీ పతాకాన్ని ఎగురవేసి భద్రతా ప్రతిజ్ఞ చేశారు. శ్రీసిటీ సిబ్బంది, పరిశ్రమల ఉద్యోగులతో పాటు పలు పాఠశాలల విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో భద్రత ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్‌కామత్ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశంలో భద్రత



శ్రీసిటీలో జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా మాట్లాడుతున్న సతీష్ కామత్

ముఖ్యమని, భద్రత ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలని అన్నారు. అనంతరం గత వారం రోజులుగా వివిధ పోటీల్లో పాల్గొని విజేతలైన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమాల్లో శ్రీసిటీ మేనేజర్ (సేఫ్టీ) నరేంద్రబాబు పాల్గొన్నారు.

## శ్రీసిటీని అభినందించిన కేంద్ర పన్నులశాఖ చీఫ్ కమిషనర్

విశాఖపట్నం జోన్ కస్టమ్స్, కేంద్ర పన్నులశాఖ చీఫ్ కమిషనర్ బి. హరేరామ్ ఈనెల 3న శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ సి. రమేష్‌కుమార్ ఆయనకు స్వాగతం పలికా, శ్రీసిటీలోని మౌళిక వసతులు, పారిశ్రామిక ప్రగతి వివరించారు. శ్రీసిటీ పరిసరాలను సందర్శించారు.




హరేరామ్‌కు స్వాగతం చెబుతున్న రమేష్ కుమార్





# కళ్యాణ వైభవం...!

## సాయి చందన - కౌశిక్



నెల్లూరు మాగుంట లే అవుట్ వాస్తవ్యులు, మాజీ బిఎస్ఎన్ఎల్ అధికారి బయ్యపురెడ్డి చంద్రమోహన్‌రెడ్డి - శ్రీలతల కుమార్తె **సాయి చందన రెడ్డి - కౌశిక్‌కుమార్‌రెడ్డి** (వింజమూరు వాస్తవ్యులు గోపిరెడ్డి శ్రీనివాసులురెడ్డి - ప్రమీలల కుమారుడు)ల పెళ్ళి ఫిబ్రవరి 24వ తేదీ వింజమూరులోని విఆర్ ఫంక్షన్ హాల్ నందు జరిగింది. నూతన దంపతులకు 'లాయర్' శుభదీవెనలు.

## కార్తిక్ - జ్యోత్స్న




విశాలాక్షి వృద్ధాశ్రమం వ్యవస్థాపకులు కోసూరు రత్నం - లక్ష్మిల కుమారుడు **కార్తిక్ - జ్యోత్స్న** (ప్రకాశం జిల్లా కొత్తపట్నం వాస్తవ్యులు నాడారు రమేష్ - శ్రీవల్లిల కుమార్తె)ల కళ్యాణం ఫిబ్రవరి 24వ తేదీ గొలగమూడిలోని భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి కళ్యాణ మండపం నందు జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

## విష్ణు - మధురిమ



వేదపండితులు బండాత్మకూరు లక్ష్మీనరసింహప్రసాద్ శర్మ - సత్యవతిల కుమారుడు **విష్ణు - మధురిమ** (చిత్తూరు జిల్లా కార్వేటి నగర్ వాస్తవ్యులు కవిచెరుకూరు రామనాథశాస్త్రి - కృష్ణవేణిల కుమార్తె)ల వివాహం ఫిబ్రవరి 15వ తేదీ తిరుపతిలో టిఎంఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. నవదంపతులకు 'లాయర్' శుభాశీస్సులు.

## శివాని - సాగర్



నెల్లూరు శాంతి నగర్ వాస్తవ్యులు, సబ్‌రిజిస్ట్రార్ యాసంకేసరి నందకిషోర్ - విజయలక్ష్మిల కుమార్తె **కామాక్షి శివాని - కిన్నెర సాగర్** (నెల్లూరు ఏసి నగర్ వాస్తవ్యులు కిన్నెర మాల్యాద్రి - జయలక్ష్మిల కుమారుడు)ల పరిణయం ఫిబ్రవరి 24వ తేదీ నెల్లూరులోని పివిఆర్ కళ్యాణ మండపం నందు జరిగింది. కొత్త జంటకు 'లాయర్' శుభాభినందనలు.

# గూడూరు డివిజన్ వార్తలు

## అభివాదంతో సరిపెట్టిన జనసేనాని



ప్రజలకు అభివాదం చేస్తున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ జిల్లా పర్యటనలో భాగంగా ఈనెల 3న గూడూరు నియోజకవర్గంలోని చిల్లకూరు నేషనల్‌హైవే సర్కిల్‌కు చేరుకున్నారు. జనసేన నాయకులు తీగల చంద్రశేఖర్, ఊదా అశోక్ కుమార్, సయీద్ నయీం తదితరుల ఆధ్వర్యంలో పవన్‌కల్యాణ్‌కు స్వాగతం పలికారు. జాతీయ రహదారిపై బైక్‌ర్యాలీ కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూర్య, ఇమ్రాన్, అల్లం బాబు, బాలు, బుజంగేంద్రరావు, హాజీఖాదర్, శివ, సాయి, శ్రీను, గోవర్ధన్, జనార్దన్, త్రివేది తదితరులు పాల్గొన్నారు. పవన్ రాకను తెలుసుకుని పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్దఎత్తున అక్కడకు చేరుకుని పవన్‌కు స్వాగతం పలికారు. పవన్ తన వాహనం మీదినుంచే అందరికీ అభివాదం చేస్తూ వెళ్ళిపోయారు. దీంతో పవన్ ఇక్కడ ప్రసంగిస్తారని ఆశగా నిరీక్షించిన అభిమానులు నిరాశగా వెనుదిరిగారు.

## చేడిమాలలో ఉచిత వైద్య కేంద్రం



ఉచిత వైద్యపరీక్షల కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రముఖ వైద్యుడు డా.సి.జనార్దన్‌రెడ్డి

చిల్లకూరు మండలంలోని చేడిమాల గ్రామంలో ఈనెల 3న రాజినేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో షుగర్, బిపి ఉచిత వైద్యపరీక్షా కేంద్రం ఏర్పాటు చేశారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ సిఆర్‌రెడ్డి హాస్పిటల్స్ వైద్యుడు డా. సి.జనార్దన్‌రెడ్డి ఈ వైద్యపరీక్షా కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మారుమూల గ్రామాల ప్రజలకు కూడా ఇలాంటి వైద్యపరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉండేలా ఏర్పాటుచేయడం ఎంతైనా సంతోషకరమన్నారు. నేటి సమాజంలో మానవతా విలువలు తగ్గిపోతున్న నేపథ్యంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం, ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజినేని శ్రీనివాసులునాయుడు మాట్లాడుతూ షుగర్, బిపి వంటి వాటిని ముందే గుర్తించి తగు చికిత్సలు చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రజలకు సూచించారు. భవిష్యత్తులో ఆసుపత్రిని కూడా ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అకడిమిక్ మానిటరింగ్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్, ట్రస్ట్ వ్యవస్థాపకులు శిరీష, పిచ్చయ్యనాయుడు, రామానాయుడు, హెడ్మాస్టర్ నాగేశ్వరరావు, రొటేరియన్లు పి.మునిరాజా, బి.దశరథరామిరెడ్డి, తిరుపతియాదవ్, మంజులమ్మ, రాజేష్ పాల్గొన్నారు.

## రియాజ్ అహ్మద్ కృషి అభినందనీయం



షేక్ రియాజ్ అహ్మద్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజనీర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంతో చర్చించి ఆ సమస్యలు పరిష్కరించినందుకు ఆ సంఘం అధ్యక్షుడు, జేఏసి సెక్రటరీ షేక్ రియాజ్ అహ్మద్‌ను అభినందిస్తూ గూడూరులోని ఆ శాఖ కార్యాలయంలో ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిగిన ఈ కార్యక్రమంలో ఇ.ఇ కాంతారావు మాట్లాడుతూ పంచాయతిరాజ్ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోను, పంచాయతిరాజ్‌శాఖ మంత్రి నారా లోకేష్‌తోను పంచాయతిరాజ్ డిప్లొమా ఇంజనీరింగ్ అసోసియేషన్ ప్రతినిధులు సంప్రదించారని ఉద్యోగులు వారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మస్తాన్, వెంకయ్య, శ్రీనయ్య, ఇలియాజ్ రవికుమార్, కొండూరు వెంకటేశ్వర్లురాజు తదితరులు పాల్గొన్నారు.

## రైలు ప్రయాణీకులకు భద్రత పెంచేలా చర్యలు



గూడూరు రైల్వే పోలీసులతో చర్చిస్తున్న ఎస్ఐ కోటయ్య

ఈ వేసవికాలంలో రైల్వేస్టేషన్లలో చోరీలు జరగకుండా నియంత్రించేందుకు, ప్రయాణీకుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని జిఆర్‌పి ఎస్ఐ కోటయ్య చెప్పారు. ఈనెల 4న ఆయన గూడూరు రైల్వేస్టేషన్‌లో పోలీసులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. రైళ్ళలో చోరీలను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా పెంచాలని, గతంలో చోరీలకు పాల్పడిన నేరగాళ్ళపై నిఘా ఉంచాలని పోలీసులను ఆదేశించారు. అదేవిధంగా ప్రయాణీకులు కూడా తమకు చెందిన విలువైన వస్తువుల పట్ల తగు జాగ్రత్తలతో ఉండాలని సూచించారు. రైళ్ళలో ఎవరైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే హెల్ప్ నెంబర్ 182కు సమాచారం అందించాలని కోరారు.

# ఇమ్రాన్‌పై దాడికి పాల్పడ్డ కూటమి నేతలు

అది న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్... రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో ఉప రాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు కలిసి టీ తాగుతూ రిపబ్లిక్ టీవీలో భారత ఫైలట్ అభినందన్ విడుదలకు సంబంధించిన వార్తా సన్నివేశాలను చూస్తున్నారు. అంతలో టీవీ స్క్రీన్‌పై బ్రేకింగ్ న్యూస్ అంటూ ఫ్లాష్ న్యూస్ రాసాగాయి. పాకిస్థాన్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్‌పై భారత్‌లోని మహాకూటమి నేతల దాడి... కొద్దిపాటి గాయాలతో తప్పించుకున్న ఇమ్రాన్... దాడిలో పాల్గొన్న రాహుల్, మమతా, అరవింద్ కేజ్రీవాల్, చంద్రబాబు, కుమారస్వామి... పాక్ ఆర్మీ సాయంతో బయటపడి సైనిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇమ్రాన్... మహాకూటమి నేతల దాడికి పాకిస్థాన్ ప్రజల మద్దతు... సన్నివేశాలు లేకుండా వట్టి ఫ్లాష్ న్యూసే వచ్చాయి. దీంతో ఏం జరిగిందో వాళ్లిద్దరికీ అర్థం కాలేదు. ఏం జరిగివుంటుంది వెంకయ్యాజీ అని రామ్‌నాథ్ కోవింద్ అడిగాడు. వెంకయ్య అప్పటికే బాగా ఉద్వేగ్నానికి లోనై... మనం మన దేశ భక్తిని పాక్ ఉగ్రశిబిరాలపై వైమానిక దాడులతో చూపిస్తే... వాళ్ళు ఏకంగా తమ దేశభక్తిని చూపించుకోవడానికి పాకిస్థాన్‌కెళ్లి ఆ దేశ అధ్యక్షుడిపైనే దాడి చేశారు. దేశ భక్తి అంటే వీళ్లది. వీళ్ళ దేశభక్తికి నా రోమాలే నిక్కబొడుచుకుంటున్నాయని చెప్పాడు. రామ్‌నాథ్ కోవింద్ వెంటనే ప్రధాని మోడీకి ఫోన్ చేసి... నువ్వు, మీ మంత్రులు వెంటనే రాష్ట్రపతి భవన్‌కు రండి అని చెప్పి పెట్టేశాడు. ఆయన ఫోన్ పెట్టేసిన పదిహేను నిముషాల్లో ప్రధాని మోడీ, రక్షణ శాఖ మంత్రి నిర్మల సీతారామన్, హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, రైల్వేమంత్రి పియూష్ గోయెల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్‌దోవల్‌లు అక్కడ వున్నారు. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వారితో... చూశారా మహాకూటమి నేతల ధైర్యసాహసాలు... వాళ్ళ దేశభక్తిని... మనం ఇక్కడ వుండి పాకిస్థాన్‌పై పోరాడుతుంటే, వాళ్ళు నేరుగా పాకిస్థాన్‌కే వెళ్ళి ఇమ్రాన్ ఖాన్‌ను తన్నబోయారు. దేశభక్తికి ప్రతిరూపం బీజేపీ నాయకత్వం అని మనం ప్రచారం చేసుకుంటుంటాం... కాని దేశ భక్తి అన్నది పలికే గొంతులోనే కాదు, తన్నే కాలిలోనూ కనపడాలని మహాకూటమి నాయకులు నిరూపించారు. హేట్సాఫ్ మహాకూటమి లీడర్స్ అని చెప్పాడు. ఉపరాష్ట్రపతి వెంకయ్య అయితే.. మీరంతా మహాకూటమి పార్టీలపై అనవసరంగా నిందలేస్తున్నారు. పాకిస్థాన్‌కు వాళ్ళు అనుకూలంగా ప్రకటనలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. కాని, ఈరోజు వాళ్ళ దేశభక్తి ప్రదర్శన ముందు మన దేశభక్తి దిగదుడుపు అనిపిస్తోంది. మా హైటెక్‌రత్న చంద్రబాబుకైతే ఇంతకాలం తెలుగుదేశం మీదే భక్తి వుందనుకున్నాను... ఆయనకు భారతదేశం మీద భక్తి ఇంకా ఎక్కువ వుందని ఇప్పుడే తెలుసుకున్నాను అని ఉద్వేగంతో అంటూ కళ్ళల్లోంచి ఉబికివస్తున్న నీటిని ఆపుకున్నాడు.

అంతా విన్న మోడీ... అలా హాల్‌లో కెళ్లి కూర్చుని మాట్లాడుకుందామని చెప్పి లోపలకు తీసుకెళ్లాడు. ధోవల్‌జీ ఆ సిడి ఇలా ఇవ్వండని అడిగాడు. అజిత్ ధోవర్ ఆయన చేతిలో ఒక సి.డి పెట్టాడు. వెంటనే ఆయన అక్కడే వున్న సి.డి ప్లేయర్‌లో దానిని పెట్టి ఆన్ చేశాడు. టీవీ స్క్రీన్‌పై సీన్‌లు మొదలయ్యాయి. అందరూ ఆసక్తిగా చూడసాగారు.

★★★★★

అది ఢిల్లీలోని పాకిస్థాన్ హైకమిషనర్ కార్యాలయం... దాని ముందు కూర్చుని మహాకూటమి నాయకులు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, దిగ్విజయ్‌సింగ్, మమతా బెనర్జీ, చంద్రబాబు, అరవింద్ కేజ్రీవాల్, కుమారస్వామి, శరద్‌పవార్ తదితర నేతలు నల్లజెండాలు చేతపట్టి... ఇమ్రాన్ డౌన్‌డౌన్, భారత్‌లో ఉగ్రదాడులు అరికట్టలేని ఇమ్రాన్ దిగిపోవాలి అంటూ నినాదాలు చేస్తున్నారు. వాళ్ల నినాదాలు విని కొద్ది సేపటికి పాకిస్థాన్ సైనిక కమిషనర్ సయ్యద్ సమర్ బయటకు వచ్చాడు. వారితో... మీరు ఇక్కడ ధర్నా చేసి లాభం లేదు... కావాలంటే మీ అందరికీ వీసాలు రెడీ చేయిస్తాను, ఇస్లామాబాద్‌కెళ్లి ఇమ్రాన్‌ఖాన్ తోనే తేల్చుకోండి అని చెప్పేశాడు. దానికి రాహుల్... మాకొచ్చే కసికి ఇమ్రాన్‌ఖాన్ ఎదురుపడితే విరగ్గొడతాం అని అన్నాడు. మమతా అయితే నేను కలకత్తా కాళికనై కసితీరా నలగదంతా అంది. చంద్రబాబు అయితే... ఆ మాత్రం బాధ వుండదండి... రక్తం పొంగిపోతుంది అని అన్నాడు.

(ఈ సీన్‌లు చూస్తున్నప్పుడు రామ్‌నాథ్ కోవింద్, వెంకయ్యల కళ్ళల్లో నీళ్లు కారసాగాయి. వీళ్ళు చూపించేది దేశభక్తి కూడా కాదు, దేశంపై పిచ్చి... ఇలాంటి వాళ్ళనా మనం అపార్థం చేసుకున్నది అని మనసుల్లో అనుకోసాగారు.)

పాకిస్థాన్ హైకమిషనర్ వారితో... దయచేసి ఇక్కడ్నుండి వెళ్లండి... ఇస్లామాబాద్‌లో ఇమ్రాన్‌తో తేల్చుకోండని చెప్పి లోపలకు వెళ్లిపోయాడు.

మహాకూటమి నేతలు అక్కడ తమ వెంట తెచ్చుకున్న ఇమ్రాన్‌ఖాన్ బొమ్మను తగలబెట్టేసి నేరుగా పాలం విమానాశ్రయం చేరుకున్నారు. ఇస్లామాబాద్ వెళ్లే విమానం ఎక్కారు.

రెండు గంటల తర్వాత ఇస్లామాబాద్ ఎయిర్‌పోర్టులో దిగారు. నేరుగా పాక్ అధ్యక్షుడు ఇమ్రాన్‌ఖాన్ కార్యాలయానికి వెళ్లారు. పి.ఏ లోపలకు వచ్చి... సార్, భారత్ నుండి బీజేపీ వ్యతిరేక పార్టీల నాయకులు మిమ్మల్ని చూడడానికి వచ్చారు అని చెప్పాడు. వీళ్ళు వచ్చారని తెలిసి ఇమ్రాన్‌ఖాన్ సంబరపడ్డాడు. భారత్ కౌంటర్ టెర్రర్ అటాక్ విషయంలో ప్రపంచ దేశాలన్నీ తననే వేలెత్తి చూపించినా, తనకు అండగా నిలిచింది భారత్‌లోని ప్రతిపక్షాలే! నన్ను అభినందించడానికే వీళ్ళు వచ్చి వుంటారు. వాళ్ళను లోపలకు పంపించు... అందరికీ మంచి బిరియానీ రెడీ చేయించు అని చెప్పాడు. పి.ఏ బయటకొచ్చి సార్ రమ్మంటున్నాడని చెప్పాడు. అందరూ లోపలకు వెళ్లారు. అందరూ తనను కౌగిలించుకుంటారని ఇమ్రాన్ ఊహించాడు. కాని, అక్కడ ఊహించని పరిణామం జరిగింది. ఒక్కసారిగా అందరూ ఇమ్రాన్‌పై దాడి చేశారు. ఆయన చొక్కా చించేసారు. ఆయన జుట్టు పీకారు. మమత అయితే... చేతకాని దద్దమ్మ అంటూ తిట్టసాగింది. రాహుల్ అయితే ఐస్‌పుల్ల నోట్లో పెట్టుకుని ఇమ్రాన్‌ను పడేసి ముఖం మీద కొట్టసాగాడు. లోపల గొడవ జరుగుతుందని తెలిసి బయట వున్న పాక్ మంత్రులు ఖురేషి, సయ్యద్‌షాలు లోపల కొచ్చారు. కూటమి నేతలను బలవంతంగా పక్కకు లాగి, గాయాలపాలైన ఇమ్రాన్‌ను సైనిక ఆసుపత్రికి పంపించారు. కోపంతో రగిలిపోతున్న కూటమి నాయకులతో పాక్ మంత్రి ఖురేషీ... టెర్రరిస్ట్ దాడికి శిబిరాలపై వైమానిక దాడులు చేశారు కదా... మళ్ళీ ఈ దాడులు చేయడమేంటి? అని నిలదీశారు. అప్పుడు మమత... మా బాధ మీకు అర్థం కాదులే... మేం ఇప్పటిదాకా నోట్ల రద్దు, జిఎస్టీ, వ్యవస్థల నిర్వీర్యం అంటూ మోడీకి వ్యతిరేకంగా దేశంలో బలమైన పునాదులు వేశాం. ఇంకో రెండు నెలలు ఓపిక పట్టుంటే ఎలక్షన్‌లు అయిపోయేవి... ఆ ఊపులోనే మోడీని ఓడించేవాళ్ళం. ఏదో మునిగిపోయినట్లు మీవాళ్ళు ఇప్పుడే పుల్వామా దాడికి పాల్పడ్డారు. అక్కడే మన్నా ప్రధానిగా వుండేది మన్మోహన్ సింగ్ అనుకున్నారా... అధికారంలో వుండేది కాంగ్రెస్ అనుకున్నారా? మీరు పుల్వామా దాడి అనగానే... మా మోడీ ఎయిర్ అటాక్ అనే... దీనికితోడు మీకు దొరికిన మా ఫైలట్ అభినందన్‌ను ఏదో మునిగిపోయినట్లు అప్పుడే విడిచి పెడితిరి... మా దేశంలో జనాలంతా మళ్ళీ మోడీ జై అంటున్నారు. మా ఆశలన్నీ ఆవిరైపోయాయి... ఆ ఫ్రెస్టేషన్‌లోనే ఇమ్రాన్‌ను తుక్కురేగ గొట్టాం అని చెప్పింది. ఆమె మాటలు విని అక్కడున్న పాక్ మంత్రి ఖురేషే కాదు... టీవీలో ఆ సీన్‌లు చూస్తున్న రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతులు కూడా నోర్లెళ్ళబెట్టారు.

---

### షిరిడిసాయి మందిరంలో

## మహాశివరాత్రి వేడుకలు

నెల్లూరు నవాబుపేట శ్రీరామకృష్ణానగర్‌లోని షిరిడి సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 4న మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, పూలంగిసేవ, పంచామృతాభిషేకాలు, పాలాభిషేకం తదితర కార్యక్రమాలను మందిరం మేనేజింగ్ ట్రస్టీ నాగిశెట్టి బాబురావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు సమర్పించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### అద్దాల సాయిబాబా మందిరంలో...

నెల్లూరు బాలాజీనగర్ చివర పద్మావతినగర్‌లో వేంచేసియున్న శ్రీసాయి దర్బార్ అద్దాల మందిరంలో మహాశివరాత్రి సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ఆలయ మేనేజింగ్ ట్రస్టీ మధుసూదనసాయి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## నేత్రపర్వంగా.. లక్ష్మీనృసింహునికి ఊంజల్‌సేవ

రాపూరు మండలంలోని పెంచలకోన క్షేత్రంలో కొలువైవున్న శ్రీ లక్ష్మీనృసింహస్వామికి ఈనెల 2వ తేది రాత్రి నేత్రపర్వంగా ఊంజల్‌సేవ నిర్వహించారు. స్వామివారి నిత్యకల్యాణ మండపంలో స్వామివార్ల ఉత్సవమూర్తులను కొలువుదీర్చి శోభాయమానంగా అలంకరించిన అనంతరం సహస్రదీపాలంకరణ మండపానికి తీసుకువచ్చి వేడుకగా ఊంజల్‌సేవ నిర్వహించారు. తొలుత ఉదయం 11గంటలకు శ్రీ స్వామివారికి, దేవేరులైన ఆదిలక్ష్మీదేవి-చెంచులక్ష్మీదేవి అమ్మవార్లకు వేదమంత్రాల మధ్య ఎంతో భక్తిశ్రద్ధలతో కల్యాణోత్సవం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో ఈ వేడుకల్లో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు.

## టిడిపి నాయకులు తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

**- కర్నాటి ఆంజనేయరెడ్డి**



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రం అన్ని విధాలా సహాయం చేస్తుంటే రాష్ట్రంలోని టిడిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి ఆరోపించారు. ఈ నెల 3న నెల్లూరులోని జిల్లా పార్టీ కార్యాలయంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వేజోన్‌ను కేంద్రం ప్రకటిస్తే అది మాయాజోన్ అని చంద్రబాబు మాట్లాడడం సబబుకాదన్నారు. ప్రతి పక్షాలు కూడా అవగాహన లేకుండా మాట్లాడుతున్నాయన్నారు. ప్రధాని మోదీ విశాఖ పర్యటన సందర్భంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా వుంటూ ప్రధానిని అవమానించేలా నల్ల చొక్కాలు, రిబ్బన్లు ధరించి అడ్డుకునేందుకు ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో రూ.50వేల కోట్లతో రైల్వేప్రాజెక్టులు జరుగుతున్నాయని, అందులో భాగంగా నెల్లూరు ప్రధాన రైల్వేస్టేషన్ అభివృద్ధి కోసం రూ.100కోట్లు ఖర్చు చేస్తున్నామన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని, అది సరికాదన్నారు. తమ పార్టీ అధిష్టానం పిలుపు మేరకు ఈ నెల 2న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బైక్‌ర్యాలీ విజయవంతమైందన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్ర రెడ్డి, కె.జగన్మోహన్‌రావు, మస్తానయ్య గౌడ్, పరశురాం, కోసూరు బాలయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో శివలింగానికి విశేష పూజలు



శివలింగానికి పూజలు చేస్తున్న మహిళలు

నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం ఆర్టీసీ ట్రైనింగ్ కాలేజీ ఎదురుగా అడవిలో వున్న శ్రీ దుర్గాభవాని సమేత అభయ లింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 4న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రుద్రాభిషేకాలు, కళ్యాణ మహోత్సవాలు, విశేషపూజలు ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యస్వామి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తి గీతాలాపనలు, కోలాటాలు నేత్రపర్వంగా నిర్వహించారు. పాలకమండలి సభ్యులు బి.శీనయ్య, పి.జగదీశ్వరరావు, ఎన్.చిరంజీవి ఆచారి, ఎం.రవికుమార్, డిసివి రమణయ్యస్వామి, కేఎం శేఖరయ్య, ఎస్.నాగిరెడ్డి పర్యవేక్షించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని శ్రీస్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

### వెంకన్నపాలెంలో...

# నీలకంతేశ్వరుని ఆలయ జీర్ణోద్ధరణ



తోటపల్లిగూడూరు మండలంలోని వెంకన్నపాళెం గ్రామంలో వెలసివున్న బాలాత్రిపురసుందరీ సమేత శ్రీ నీలకంతేశ్వరస్వామి దేవాలయ పునరుద్ధరణ, సంప్రోక్షణ, మహాకుంభాభిషేక మహోత్సవాలు ఇటీవల ఎంతో వైభవంగా జరిగాయి. గ్రామస్తులు, దాతల సాయంతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త మూలంరెడ్డి సుబ్బరామిరెడ్డి సారధ్యంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో గ్రామస్తులు, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ప్రసిద్ధ పండితులు మాచవోలు కోటేశ్వరశర్మ ఆధ్వర్యంలో త్రయాహ్నిక దీక్షతో ఈ ప్రతిష్టా కార్యక్రమాలు జరిగాయి. మూడురోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమాల్లో ఆలయంలో విశేష పూజలు చేశారు. నూతన ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించారు. అనంతరం భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు.

# పానుగంటి సేవలు ఆదర్శప్రాయం



సభలో ప్రసంగిస్తున్న మోపూరు వేణుగోపాలయ్య

ప్రముఖ సమాజసేవకుడు దివంగత పానుగంటి వెంకటకృష్ణయ్య సంతాపసభ గతనెల 28న నెల్లూరు మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీసమాజంలో జరిగింది. స్థానిక ప్రముఖులు పి.బలరామిరెడ్డి, పి.నారాయణస్వామి పాల్గొని వెంకటకృష్ణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం జరిగిన సంతాపసభకు ప్రముఖ సాహితీవేత్త మోపూరు వేణుగోపాలయ్య అధ్యక్షత వహించారు. సరస్వతీ సమాజం కార్యదర్శి టి.రమణయ్య మాట్లాడుతూ వెంకటకృష్ణయ్య సేవలను ప్రస్తుతించారు. కార్పొరేషన్ ప్రతిపక్ష నాయకుడు పోలుబోయిన రూప్‌కుమార్‌యాదవ్, ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, ఏపియుడబ్ల్యుజె నాయకుడు ఏ.జయప్రకాష్, జిల్లా భాషోద్యమ సమితి అధ్యక్షుడు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, స్వచ్ఛంధసేవకుడు తిక్కవరపు సుకుమార్‌రెడ్డి, జి.ఆర్ సుబ్రహ్మణ్యం, జి. రాధాకృష్ణయ్య, బాలభాస్కర్, శారద, భావన తదితరులు పాల్గొన్నారు.

## కాలధర్మం

# బండి కృష్ణారెడ్డి



రాపూరు మండలంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, ఆనం కుటుంబానికి అత్యంత సన్నిహితుడు, మాజీ ఎం.పి.పి బండి కృష్ణారెడ్డి ఈ నెల 1వ తేదీన స్వర్గస్తులైనారు. ఆయన వయసు 75సంవత్సరాలు, ఆయనకు ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. బెంగుళూరులో ప్రముఖ రియల్టర్, నెల్లూరులోని ఏఎన్ఆర్ కళ్యాణ మండపం అధినేత బండి ఆదినారాయణరెడ్డి ఆయన పెద్దకుమారుడవుతాడు. ఆదినారాయణరెడ్డి సేవాభారత్ ట్రస్ట్‌ను స్థాపించి జిల్లాలో తన తండ్రి కృష్ణారెడ్డి చేతుల మీదుగా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

రాపూరు మండలం పెనుబర్తి మజరా లింగపాలెం కృష్ణారెడ్డి స్వగ్రామం. ఆయన తొలుత పెనుబర్తి సర్పంచ్‌గాను, ఆ తర్వాత రాపూరు ఎంపిపి గానూ సేవలందించారు. రాపూరు నియోజకవర్గంలో ఆనంకు ముఖ్యఅనుచరుడిగా వుంటూ ఈ నియోజక వర్గం నుండి ఆనం కుటుంబసభ్యుల విజయంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన మృతికి సంతాపం ప్రకటిస్తూ, వారి కుటుంబసభ్యులకు సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.











1. దేవ్ గోస్వామి తార దంపతులకు అవార్డును అందజేస్తున్న మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి
2. డా॥ ప్రహ్లాదన్‌కు అవార్డును అందజేస్తున్న వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, 'లాయర్' ప్రభు
3. వాత్సల్య తరపున అవార్డును స్వీకరిస్తున్న సామంతు గోపాలరెడ్డి
4. బాబర్ ఆలీకి అవార్డును అందజేస్తున్న డా॥ వరప్రసాద్‌రెడ్డి
5. తమ నృత్యంతో అలరించిన వాత్సల్య విద్యార్థినులు

### గుండె తలుపు తట్టిన.. లత రాజ ఫౌండేషన్ వారి...

# సేవా ధార్మిక అవార్డుల సంబరం

మానవజన్మ భగవంతుడిచ్చిన వరమైతే, మనిషిగా జన్మించి సమాజసేవలో తరించి "మహామనీషి" అనిపించుకోవడం భగవత్ కృపతో కలిగే మహద్భాగ్యం. అయితే సమాజసేవలో పునీత మౌతున్న మహనీయులను సత్కరించి గౌరవించే అవకాశం రావడం జన్మజన్మల పుణ్యఫలం. అలాంటి పుణ్యమే ఈ జన్మలో తమ సొంతం చేసుకుంటున్నారు లత రాజ ఫౌండేషన్ సారధులు కె.కె.రాజ, ఆయన కుటుంబసభ్యులతో పాటు ఇతర ట్రస్టీలు.

లంచగొండితనానికి తలవంచలేక ప్రభుత్వ ఉద్యోగానికి సైతం రాజీనామా చేసి "ఎగ్జాటిక్ ఈవెంట్స్" అనే సంస్థను నెలకొల్పి గత ఒకటిన్నర దశాబ్దకాలంగా తన సంస్థలో వచ్చే లాభాలను 50శాతానికి పైగా సమాజ శ్రేయస్సు కోసం వెచ్చిస్తున్న కె.కె.రాజ ఆయన శ్రీమతి లతతో పాటు ఆయన కుమార్తెలిద్దరూ సేవారంగానికి స్ఫూర్తిప్రదాతలుగా మారారు. మూడున్నర సంవత్సరాల క్రితం విధి ఆడిన వింత నాటకంలో రాజ శ్రీమతి లత దైవసాన్నిధ్యం పొందడంతో ఆమె పేరును ముందుంచి లత రాజ ఫౌండేషన్ పేరిట సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ ట్రస్టు సభ్యులుగా తనతోపాటు పద్మభూషణ్ గ్రహీత డా॥ వరప్రసాద్‌రెడ్డిని మరికొంతమంది సేవామూర్తులను జట్టుగా చేసుకుని తన కార్యకలాపాలను నిర్వహిస్తున్నాడు కె.కె.రాజా.

కేవలం సమాజసేవకే తమ సంస్థను అంకితం చేయకుండా భారతదేశంలోని వివిధ ప్రాంతాలతో కేవలం సేవకే ప్రాధాన్యత కల్పిస్తూ తమ జీవితాలను అంకితం చేసిన, చేస్తున్న మహనీయులను, సంస్థలను గుర్తించి తనే స్వయంగా ఆ సంస్థలను సందర్శించి వాళ్ళు చేసే సేవా సేద్యాన్ని కళ్ళారా తిలకించి వారిని సేవాధార్మిక అవార్డుకు ఎంపిక చేసి సత్కరిస్తున్నాడు రాజ.

ఈ క్రమంలో భాగంగా ఇప్పటికే హైదరాబాదు, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి నగరాలలో ఈ ధార్మిక సేవా అవార్డుల మహోత్సవాన్ని నిర్వహించగా, 5వ కార్యక్రమానికి నెల్లూరును వేదిక చేశారు సంస్థ నిర్వాహకులు. మార్చి 3వ తేదీ ఆదివారం నెల్లూరు శ్రీ వెంకటేశ్వర కస్తూర్భా కళాక్షేత్రంలో జరిగిన ఈ వేడుకలో 4సంస్థల సారధులను ఎంపిక చేసి నాలుగు సేవా ధార్మిక అవార్డులను అందజేశారు.

## దేవ్ ఎనిమల్ వాలంటరి ఆర్గనైజేషన్(DAVO)

నిరాధార జీవులను, మానసిక వికలాంగులను అక్కున చేర్చుకుని వారికి అండదండగా వుంటూ ప్రేమానురాగాలను చూపిస్తూ వారి ఆలనాపాలన తనే స్వయంగా చూసుకుంటూ తన సంస్థ ద్వారా సేవలందిస్తున్న న్యూఢిల్లీకి చెందిన దేవ్ ఎనిమల్ వాలంటరి ఆర్గనైజేషన్ నిర్వాహకులు దేవ్‌గోస్వామి, తార దంపతులకు రాష్ట్ర వ్యవసాయశాఖామాత్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ద్వారా సేవాధార్మిక అవార్డును అందజేశారు. రైలు ప్రమాదంలో తన రెండుకాళ్ళను, ఒక చేతిని కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో బి.ఎస్.గ్రూప్ ఆఫ్ కంపెనీస్ స్థాపించి సంస్థలో వచ్చే లాభాల ద్వారా సేవా కార్యక్రమాలకు తనవంతు చేయూతనందిస్తున్న బండారి శ్రీనివాస్ కూడా ఈ అవార్డు ప్రదానోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి తన ప్రసంగంలో నిస్వార్ధ ప్రజాసేవ చేస్తున్న దేవ్‌గోస్వామి దంపతులతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఇతర సేవాపరాయణులను సత్కరించే కార్యక్రమంలో తాను పాల్గొనడం తనకు చాలా ఆనందంగా వుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాస్ఫూర్తిని కలిగిస్తాయని అన్నారు. బండారి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎక్కడ మంచిని సత్కరిస్తారో అక్కడ నేనుంటా, ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్న రాజ నాకు మంచి మిత్రుడు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు నాకు చేతనైన సహాయం అందించడంతో పాటు నేను వ్యక్తిగతంగా పాల్గొంటే కొంతమందికైనా స్ఫూర్తికాగలననే ఆశయంతో వీలైనంతవరకు అన్ని కార్యక్రమాలలో పాల్గొంటానని అన్నారు.

## భూమి - చెన్నై

యువతరంలో చైతన్యదీప్తిని రగిలిస్తూ వారిలో సేవాస్ఫూర్తిని కల్పిస్తూ కొన్ని వేలమందికి మార్గదర్శకంగా నిలిచి చెన్నై మహానగరం కేంద్రంగా 20కిపైగా నగరాలలో తమ సంస్థ కార్యకలాపాలను నిర్వహిస్తూ "భూమి" సంస్థ ద్వారా సేవా రంగంలో తరిస్తున్న మరో మేధావి డా॥ ప్రహ్లాదన్ రెండవ ధార్మిక సేవా అవార్డును సేవాభూషణ్, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి భావోద్వేగంతో మాట్లాడుతూ ఈ సేవ ఆలయంలో భగవంతుడికి అర్చకుడు చేసే పూజలాంటిదని, సమాజంలో సేవలందిస్తున్న భగవత్ స్వరూపులైన సేవకులను గుర్తించి వారిని సత్కరిస్తూ.. రాజ చేస్తున్నది కూడా భగవత్ సేవలాంటిదేనని పేర్కొన్నారు. ఇలాంటి సేవా ఋషులను సత్కరించే మహోన్నత కార్యక్రమాన్ని చేపట్టిన లత రాజ ఫౌండేషన్ నిర్వాహకుడు రాజాని అభినందించారు.

'లాయర్' నిర్వాహకుడు శివప్రభాత్‌రెడ్డి మాట్లాడుతూ అవార్డుల ఎంపికలో లత రాజ ఫౌండేషన్ చూపిస్తున్న శ్రద్ధ, ఆసక్తి గమనిస్తే సంస్థకు సేవాభావం పట్ల వున్న చిత్తశుద్ధి కనపడుతుందని అంటూ, గడచిన తరాలలో గతించిన దాతలు ఎంతోమంది గురించి మనం విన్నామని నేటి తరంలో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, డా॥ వరప్రసాద్‌రెడ్డి లాంటి దాతలను ప్రత్యక్షంగా చూస్తున్నామని అన్నాడు.

## జనహిత / వాత్సల్య - నెల్లూరు

నెల్లూరులో అనాధ బాలలకు, వృద్ధులకు సేవలందిస్తున్న జనహిత/వాత్సల్య కూడా ఈ సేవాధార్మిక అవార్డును అందుకుంది. జనహిత పక్షాన సామంతు గోపాలరెడ్డి ఈ అవార్డు స్వీకరించారు. "పద్మభూషణ్" గ్రహీత డా॥ వరప్రసాద్‌రెడ్డి ఈ అవార్డును అందించి సామంతు గోపాలరెడ్డిని సత్కరిస్తూ ఈ సంస్థ కోసం 5 సంవత్సరాల పాటు ప్రతి యేడాది తాను 5లక్షల రూపాయల వంతున విరాళం అందజేయనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే జనహితకు తన చేయూతనందిస్తున్న శ్రీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఈ అవార్డును అందజేయడం తనకు సంతోషదాయకంగా వుందని అన్నారు.

## ఆనంద్ శిక్షా నికేతన్ - ముహీరాబాద్, వెస్ట్‌బెంగాల్

16 సంవత్సరాల వయస్సులో పేదవారి కోసం ఓ పాఠశాలను స్థాపించి యువ హెడ్‌మాస్టర్‌గా బిబిసిచే పిలిపించుకున్న బాబర్ ఆలి నాల్గవ ధార్మిక సేవా అవార్డును అందుకున్నారు. 16 సంవత్సరాల ప్రాయంలోనే పూర్తిగా ఉచిత విద్యనందించే విధంగా చిరుదీపంలా ఆనంద్ శిక్షానికేతన్‌ని వెస్ట్‌బెంగాల్‌లోని ముహీరాబాద్‌లో స్థాపించి పూర్తిగా ఉచిత విద్యనందిస్తూ, నేడు అదే స్కూల్‌లో చదువుకున్న 6మంది విద్యార్థులే బాబర్ ఆలి స్ఫూర్తితో తాము చదువుకున్న స్కూల్‌లోనే పాఠాలు చెప్పే స్థాయిలో తమ సంస్థకు గుర్తింపు తెచ్చుకున్న బాబర్ ఆలీని అభినందిస్తూ వరప్రసాద్‌రెడ్డి సత్కరించారు. ఎవరికైనా సహాయం చేస్తే అది విద్య తప్ప మరే రూపంలో ఇచ్చినా శాశ్వతంగా వుండదని, విద్య మాత్రం విజ్ఞాన రూపంలో మనిషిని అంటి పెట్టుకునే వుంటుందని, అన్ని దానాల్లోకెల్లా విద్యాదానం గొప్పదని, అలాంటి కార్యక్రమాన్ని చేస్తున్న బాబర్‌ఆలీ జీవితం ధన్యమైందని అన్నారు. కన్నుల పండువగా జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవ వేడుకలో సాక్షి టివి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ స్వప్న నిర్వహణ ప్రధాన ఆకర్షణగా నిలవగా, శ్రీమతి వైష్ణవి యజ్ఞేష్ మరియు వాత్సల్య విద్యార్థినుల బృందం ప్రదర్శించిన నృత్యాలు అదనపు అందాన్ని ఆనందాన్ని చేకూర్చాయి. ఇంతటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న రాజ మరియు వారి బృందానికి 'లాయర్' అభినందనలు.

## ఆదర్శప్రాయుడు
# 'నవయుగం' కృష్ణమూర్తి


కృష్ణమూర్తికి నివాళులర్పిస్తున్న ఎపియుడబ్ల్యూజె నాయకులు

నేటి తరం జర్నలిస్టులకు నవయుగం వారపత్రిక ఎడిటర్ కృష్ణమూర్తి ఎంతో ఆదర్శప్రాయుడని ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ అన్నారు. ఈ నెల 2న నెల్లూరులోని పాత జర్నలిస్ట్‌కాలనీలో మృతిచెందిన కృష్ణమూర్తి (86) భౌతిక కాయాన్ని ఆయన దర్శించి నివాళులర్పించారు. వారి కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. ఏపియుడబ్ల్యూజె జిల్లా అధ్యక్షులు వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చందు, జనార్దన్, ఐజెయు ఉపాధ్యక్షులు అంబటి ఆంజనేయులు, సామ్నా రాష్ట్ర కార్యదర్శులు నల్లి ధర్మారావు, రమణారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సర్వేపల్లి రామ్మూర్తి, జి.హనూక్ తదితరులు విచ్చేసి నవయుగం కృష్ణమూర్తి భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.



రైతుచైతన్య యాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న జయప్రకాష్

## దేశానికి...
# వెన్నెముక రైతన్నే

రైతులు యాచకులు కాదని, దేశానికి వెన్నెముక రైతన్నలేనని ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్ అన్నారు. ఈనెల 2న కోవూరు మండలంలోని ఇనమడుగు సెంటర్ నుంచి రైతు చైతన్యయాత్రను ఆయన ప్రారంభించారు. 'సింహపురి రైతు' పత్రిక ఎడిటర్ వి.నిరంజన్‌రెడ్డి రైతుల హక్కుల సాధన కోసం చేపట్టిన ఈ రైతు చైతన్యయాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సామ్నా అధ్యక్షులు ఎన్.రామ్మూర్తి, సిహెచ్ భాస్కర్‌రెడ్డి, హనూక్‌తో పాటు రైతు నాయకులు పాల్గొన్నారు.



# మాయలోడితో పోరాడుతున్నాం!

39 డిగ్రీల ఎండదెబ్బకు మధ్యాహ్నం 12గంటలు దాటితే జనం రోడ్డు మీద తిరగడం లేదు. అలాంటిది మిట్ట మధ్యాహ్నం నడినెత్తి మీద సూర్యుడు నిప్పులు కురిపిస్తున్నా జనం కదల్లేదు... మెదల్లేదు... వేలాదిగా పోటెత్తి వచ్చిన జన సమూహం ముందు మిడిమేళంగా కాసిన ఎండ కూడా వెలవెలపోయింది.

ఈ నెల 5వ తేదీన నెల్లూరు, జాతీయ రహదారి ఆనుకుని శ్రీ వేణుగోపాల స్వామి కళాశాల మైదానంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సమర శంఖారావం' సభ విజయవంతంగా జరిగింది. వైకాపా అధినేత ప్రతిపక్ష నేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి పాల్గొన్న ఈ సభకు జిల్లా నలుమూలల నుండి ప్రజలు మండుటెండను సైతం లెక్కచేయకుండా తరలివచ్చారు. మధ్యాహ్నం 12గంటలకల్లా సభకు జనం పోటెత్తినట్లు వచ్చారు. మధ్యాహ్నం సమయంలో సభ అయినా ఎలాంటి షామియానాలు వేయలేదు. జనం ఎండలోనే కదలకుండా కూర్చున్నారు. జగన్ ప్రసంగం ఆపేంతవరకు కూడా జనం కదల్లేదు, మెదల్లేదు.

ఇక తిరుపతి ఎయిర్‌పోర్ట్‌లో దిగి అక్కడ నుండి నాయుడుపేట, గూడూరుల మీదుగా నెల్లూరులోని సభా ప్రాంగణం వద్దకు చేరుకున్న జగన్‌కు అపూర్వ స్వాగతం లభించింది. జగన్ కనిపించగానే సభా ప్రాంగణం 'జై జగన్' నినాదాలతో హోరెత్తిపోయింది. ప్రజలకు, కార్యకర్తలకు అభివాదం చేస్తూ ఆయన తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ముఖ్యంగా సభా వేదికకు అనుసంధానంగా ఏర్పాటు చేసిన ర్యాంప్‌పై ఆయన నడుస్తూ ప్రజలతో, కార్యకర్తలతో ముచ్చటించడం, వారి ప్రశ్నలకు జగన్ సమాధానాలివ్వడం వంటివి హాజరైన అభిమానులలో ఎనలేని ఉత్సాహాన్ని నింపాయి.

జగన్ తన ప్రసంగంలో... మనం మాయలోడితో యుద్ధం చేస్తున్నామని, పోరాడి యుద్ధంలో గెలవాలని కాకుండా కుట్రలు, కుతంత్రాలు, వెన్నుపోట్లతో యుద్ధం గెలవాలనే నీచ మనస్తత్వం వున్న చంద్రబాబు మాయోపాయాల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వుండాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఏ విధంగా గెలవాలనుకుంటున్నాడనడానికి హైదరాబాద్‌లో జరిగిన ఐ.టి గ్రిడ్ డేటా చోరీ ఉదంతమే పెద్ద ఉదాహరణగా పేర్కొన్నారు. తెలుగుదేశం వాళ్ళు కుట్ర రాజకీయాలకు పాల్పడుతూ లక్షలాది వైసిపి కార్యకర్తల ఓట్లు తొలగిస్తున్నారని, ప్రతి కార్యకర్త తమ ఓటు వుందో లేదో చూసుకుని, లేకుంటే నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు తాత్కాలిక తాయిలాలతో మళ్ళీ ప్రజలను మభ్యపెట్టేందుకు ఎత్తులు వేస్తున్నారని, 57నెలలు ప్రజలను ఎండబెట్టి, ఈ మూడు నెలల్లో మీకు తిండి పెడతానంటూ వస్తున్నాడని, ఇతని మాయలకు మరోసారి మోసపోయే స్థితిలో తెలుగుప్రజలు లేరని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ప్రజలకు 600 హామీలిచ్చి వాటిని అటకెక్కించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే నవరత్నాల పథకాలతో రాష్ట్రంలో నవ శకాన్ని ఆరంభిద్దామన్నారు. అలాగే జిల్లాలో దుగరాజపట్నం పోర్టు విషయమై ఆయన మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే ఇక్కడ పోర్టు నిర్మించడంతో పాటు 75శాతం ఉద్యోగాలు స్థానికులకే కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఈ సభలో పార్లమెంటు సభ్యులు వేణుంబాక విజయసాయిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీఎంపీలు మేకపాటి రాజమోహన్‌రెడ్డి, వి.వరప్రసాద్, మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మేకపాటి గౌతమ్‌రెడ్డి, పి.అనిల్‌కుమార్‌యాదవ్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు టి.రఘురామ్, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి, నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మేరిగ మురళి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, పేర్నాటి శ్యాంసుందర్‌రెడ్డి, ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

### జోష్ పెంచింది...

జిల్లాలో వైసిపి బలంగా వుంది. పార్టీకి సమర శంఖారావం సభ విజయవంతం కావడంతో మరింత జోష్‌ను తెచ్చినట్లయ్యింది.

# దొరలే డేటా దొంగలా?

(మొదటి పేజీ తరువాయి)

కూర్చున్నారు. తిరస్కరిస్తే ప్రతిపక్షంలో కూర్చున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీ అధినేతల లక్షణం అది. ప్రజలను మెప్పించ గలిగితే విజయం దానంతట అదే వస్తుంది. ప్రజల్ని మెప్పించకుండా నొప్పించినప్పుడు ప్రతిపక్షంలో కూర్చోవ దానికి కూడా సిద్ధపడాలి.

కాని దేశ చరిత్రలోనే తొలిసారిగా ఎన్నికల కనీస ధర్మాన్ని విడిచిపెట్టేసింది తెలుగుదేశం పార్టీ! ప్రజల మెప్పు పొంది వారి ఓట్ల ద్వారా గెలవడం కంటే కూడా వారి ఓట్లను తొలగించి తిరిగి అధికారాన్ని నిలబెట్టుకునే దిశగా కుయుక్తులు పన్నింది. ప్రజాస్వామ్య దేశంలో ఎంతో విలువైన ఓటు హక్కులను ప్రజల నుండే తస్కరించే దుర్మార్గపు చర్యకు ఒడిగట్టారు కొందరు ప్రబుద్ధులు. తమ పార్టీని, తమ పాలనకు వ్యతిరేకంగా వున్న వారిని సైతం మెప్పించేలా పాలన చేసి వారి ఓట్లను కూడా రాబట్టుకునే ప్రయత్నం చేయాల్సిన పార్టీ నాయకత్వం ఈ రాజమార్గాన్ని వదిలేసి తమ పార్టీకి వ్యతిరేకమని భావించిన వారి ఓట్లను పూర్తిగా ఓటర్ల జాబితా నుండే తొలగించారు. తద్వారా 2019 ఎన్నికల్లో గెలుపు కోసం అడ్డదారిని ఎంచుకున్నారు.

దాదాపు రెండేళ్ళుగా రాష్ట్ర వ్యాప్తంగా ఒక ప్రచారం వుంది. రాష్ట్రంలోని అందరి సెల్‌ఫోన్‌లకు ఒక కాల్ వస్తుంటుంది. దీంట్లో రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై మీ అభిప్రాయం ఏంటని మొబైల్ వినియోగదారుడిని అడుగుతారు. పనితీరు బాగుందంటే '1' నొక్కండి, పర్వాలేదు అనుకుంటే '2' నొక్కండి... అసలు బాగాలేదు అనుకుంటే '3' నొక్కండి అనే రికార్డర్ వాయిస్ వినిపిస్తుంది. పొరపాటున ఎవరైన '3' బటన్ నొక్కారా... అతని ఓటు గల్లంతైనట్టే! ఎందుకంటే ఎట్టి పరిస్థితులలోనూ అతను తెలుగుదేశం పార్టీకి ఓటెయ్యడు. కాబట్టి ఓటర్ల జాబితా నుండి తొలగించేశారు. ఇలా రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 56లక్షల ఓట్లు గల్లంతైనట్లు సమాచారం. టెలికాలర్ వాయిస్‌లో టిడిపి ప్రభుత్వ పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన వారందరి ఓట్లు పోతున్నాయన్నది నిన్నటి వరకు పుకారు మాత్రమే అనుకోగా, హైదరాబాద్ కేంద్రంగా మొన్న వెలుగుచూసిన ఏపి ఓటర్ల డేటా చోరీ సంఘటనతో ఇది నిజమేననే సంగతి లోకానికి వెల్లడైంది.

### పెద్దల వ్యూహమే!

రాష్ట్ర ప్రజల్లో తెలుగుదేశం ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వుంది. మళ్ళీ ఎన్నికల్లో టిడిపి గెలవడం కష్టమని సర్వేలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో టిడిపి పెద్దలు అడ్డదారిని ఎంచుకున్నారు. హైదరాబాద్‌కు ఐటిని తీసుకొచ్చింది నేనే అని పదేపదే చెప్పుకునే చంద్రబాబు అదే ఐటిని బాగా ఉపయోగించుకున్నారు. కొంతకాలం క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రజాధికార సర్వే నిర్వహించింది. ప్రతిఒక్కరి ఆధార్, ఓటర్ కార్డు, బ్యాంకు ఖాతా, వాళ్ళు పొందే పథకాల వివరాలను ఈ సర్వే ద్వారా సేకరించారు. అందరి మొబైల్ నెంబర్లు తీసుకున్నారు. ఈ డేటా అంతా కూడా ప్రభుత్వం వద్ద భద్రంగా వుండాలి. ఐ.టి శాఖ దీనికి బాధ్యతగా వ్యవహరించాలి.

అయితే ఏ లక్ష్యంతో అయితే ఈ డేటాను సేకరించారో ఆ లక్ష్యాన్ని నెరవేర్చుకోవడానికి తెలుగుదేశం నాయకులు శ్రీకారం చుట్టారు. దాకవరపు అశోక్ అనే ఐ.టి నిపుణుడు, తెలుగుదేశం సానుభూతి పరుడు నెలకొల్పిన ఐ.టి గ్రిడ్ అనే సంస్థకు ఈ డేటానంతా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ సంస్థ టిడిపి సేవామిత్ర అనే యాప్‌ను ఆవిష్కరించింది. ఈ యాప్ ద్వారా ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకోవడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వున్న వారి వివరాలను ఆయా జిల్లాలకు పంపి, అక్కడ తమకు అనుకూలురైన అధికారుల ద్వారా ఓటర్ల జాబితా నుండి వారి ఓట్లు తొలగించడం చేస్తూ వచ్చారు. ఇటీవల కాలంలో ఓటర్ల జాబితాలో తమ ఓట్లు లేవని చాలామంది గగ్గోలు పెడుతున్నారు. ఎన్నికల కమిషన్ కూడా మళ్ళీ ఓట్లు నమోదు చేసుకోండంటూ ప్రజలకు సూచిస్తుందేగాని, ఇన్ని లక్షల ఓట్లు ఎలా గల్లంతయ్యాయనే విషయంపై దృష్టి పెట్టలేకపోయింది. అయితే హైదరాబాద్‌లో వుంటున్న లోకేశ్వర్‌రెడ్డి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదుతో సైబరాబాద్ పోలీసులు రంగంలో దిగడం, ఐటి గ్రిడ్, బ్లూఫ్రాగ్ కంపెనీలపై దాడులు చేయడంతో డేటా చోరీ విషయమంతా వెలుగులోకి వచ్చింది.

### నిందితుడు అశోక్‌ది నెల్లూరే!

ఐ.టి గ్రిడ్ వ్యవస్థాపకుడు, డేటా చోరీలో ప్రధాన నిందితుడైన దాకవరపు అశోక్‌ది నెల్లూరుజిల్లా అల్లూరు మండలం. కంప్యూటర్ సైన్స్ చదివిన అశోక్ కొంత కాలం బెంగుళూరులో పని చేశాడు. ఆ తర్వాత ఐ.టి మంత్రి లోకేష్‌తో పరిచయం ఏర్పడి హైదరాబాద్ కేంద్రంగా ఐటి గ్రిడ్ సంస్థను స్థాపించాడు. డేటా చోరీ, ఓట్ల తొలగింపుకు సంబంధించి భారీ మొత్తానికే అతను కాంట్రాక్ట్ కుదుర్చుకున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుండి పారిపోయిన అశోక్ ప్రస్తుతం ఏపిలో పోలీసుల రక్షణలో తలదాచుకుంటున్నట్లు సమాచారం. అశోక్ విదేశాలకు పారిపోకుండా తెలంగాణ పోలీసులు లుక్‌అవుట్ నోటీసులు కూడా జారీ చేశారు.

### చంద్రబాబు పాత పాట!

హైదరాబాద్ కేంద్రంగా సైబర్ క్రైం చోటు చేసుకుంది. ఫిర్యాదిదారుడు హైదరాబాదీ... చోరీకి పాల్పడ్డ సంస్థ ఉండేది కూడా హైదరాబాద్‌లోనే! కాబట్టి తెలంగాణ పోలీసులే ఈ కేసు విచారణ చేపడుతారు. మనం కొన్న బంగారం విజయవాడలో కళ్యాణ్ జ్యూయలర్స్‌లోది అయినా హైదరాబాద్‌లో పోగొట్టుకుంటే... విచారణ జరగాల్సింది కూడా అక్కడే కదా! డేటా చోరీ కేసు కూడా ఇలాంటిదే! అయితే ఈ కేసులో తమ మూలాలు ఎక్కడ బయట పడతాయోనని నాయకులు భయపడుతున్నారు. తమ వైఫల్యాలను ఆంధ్రుల ఆత్మగౌరవానికి చుట్టే చంద్రబాబు, ఈ సంఘటనకు కూడా అదే కలరింగ్ ఇచ్చాడు. దీనిని ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల మధ్య యుద్ధంగా మలచాలని చూస్తున్నాడు. గతంలో ఓటు-నోటు కేసు, తెలంగాణ ఎన్నికల అంశాన్ని కూడా ఆయన అదే విధంగా చేశాడు.

### ఎన్నికల సంఘం రంగంలోకి దిగాలి!

ఈ కేసు విషయంపై ఎన్నికల సంఘం గట్టిగా దృష్టి సారించాలి. ఏపి ప్రజల డేటా చోరీ నిందితులు ఎంతటివారైనా వదలకూడదు. అదే సమయంలో ఓటర్ల జాబితాలో తప్పులు తడకలను పూర్తిగా సంస్కరించి, అందరి ఓట్లు పొందుపరిచాకే రాష్ట్రంలో ఎన్నికల యుద్ధానికి పచ్చజెండా ఊపాలి.!

# షటిల్ పోటీల్లో విజేత కేరళ



విజేతలతో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి, జమాల్ తదితరులు

గూడూరు పట్టణంలోని వైఎస్సార్ పార్కులో ది యంగ్ గూడూరు షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి షటిల్ పోటీలు ఈ నెల 3తో ముగిశాయి. తుదిపోరులో కేరళ జట్టు తన ప్రతిభ చూపుతూ విజేతగా నిలిచింది. ద్వితీయ స్థానంలో కర్నాటక, తృతీయస్థానంలో తమిళనాడు జట్లు నిలిచాయి. గూడూరు పట్టణానికి చెందిన జట్టు నాల్గవ స్థానంతో సరిపెట్టుకుంది. ముగింపు రోజున విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, నెల్లూరు నగర డిప్యూటీమేయర్ ద్వారకానాథ్, అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చేవూరు విజయమోహన్‌రెడ్డి, శ్రీలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు లక్ష్మీ పిఎం రావు, జమాల్ తదితరులు పాల్గొన్నారు.

# శంభో శంకర!.. హరహర మహాదేవ!



- **శివనామ స్మరణలతో హోరెత్తిన విశాఖ సాగరతీరం**
- **సుబ్బరామయ్య శివభక్తిని కొనియాడిన శ్రీ స్వరూపానంద స్వామీజీ**
- **అధికారం-ఐశ్వర్యం అశాశ్వతం, ప్రజల ప్రేమ - శివశక్తే.. శాశ్వతం - టిఎస్ఆర్**

మహాశివరాత్రి సందర్భంగా శంభో శంకర!..హరహర మహాదేవ!..అంటూ పెద్దపెట్టున భక్తుల శివనామ స్మరణలతో విశాఖ సాగరతీరం పులకించి పోయింది. రాజ్యసభ సభ్యులు, ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆధ్యాత్మికవేత్త.. అన్నిటికీ మించి ఆ పరమశివునికి పరమభక్తుడు అయిన టి.సుబ్బరామిరెడ్డి సారధ్యంలో కనీవినీ ఎరుగని విధంగా అత్యద్భుతంగా జరిగిన కోటి శివలింగాల ప్రతిష్ట, మహాకుంభాభిషేకం వేడుకలకు వేలాదిమంది భక్తులు తరలివచ్చారు. దీంతో విశాఖ సాగరతీరం భక్తజనసముద్రంగా మారిపోయింది. ఈ సందర్భంగా టిఎస్సార్ నేతృత్వంలో ఆదిదేవునికి అద్భుతమైన పూజలు, అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమాలు న భూతో.. న భవిష్యత్ అనే విధంగా జరిగాయి.



తన తాత గారిలా ఆధ్యాత్మిక బాటలో నడుస్తానంటూ ప్రమాణం చేస్తున్న టిఎస్ఆర్ మనుమనుడు రాజీవ్‌రెడ్డి

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని విశాఖపట్నం లోని రామకృష్ణాబీచ్‌లో ఈనెల 4వ తేది సాయంత్రం 5 నుంచి 5వ తేది వేకువన 5 గంటల వరకు శివరాత్రి వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. రాజ్యసభ సభ్యుడు, శివభక్తుడు టి.సుబ్బరామరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పాల్గొనేందుకు 4వతేది ఉదయం నుంచే భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పరమశివునికి పూజలు, అభిషేకాలు చేశారు. శారదా పీఠాధిపతి శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ముక్కామల శ్రీధరస్వామీజీలు ఈ పూజల్లో పాల్గొన్నారు. అనం తరం సుబ్బరామరెడ్డికి ఆశీస్సులు అందజేశారు.

ఈ సందర్భంగా సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ అధికారం, అందం, ఐశ్వర్యం వంటివన్నీ అశాశ్వతమని, ప్రజలప్రేమ-ఈశ్వరశక్తి మాత్రమే శాశ్వతమని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల నుంచి విశాఖను రక్షించేందుకే ఏటా ఈ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. హుద్‌హుద్ వంటి భయంకరమైన తుఫాన్‌లను సైతం విశాఖపట్నం తట్టుకుని నిలబడేందుకు ఆ శివశక్తి మనకు తోడుగా నిలచిందని ప్రజల కరతాళధ్వనుల మధ్య అన్నారు. 34 సంవత్సరాలుగా కోటి శివలింగాలతో ఆ మహాదేవునికి మహాకుంభాభిషేకం నిర్వహిస్తున్నామన్నారు. 21 ఏళ్ళుగా తాను విశాఖ ప్రజలను ఓటు అడక్కుండానే విశాఖ ప్రజల సంక్షేమం కోసం అనేకానేక కార్యక్రమాలు చేపట్టానని చెప్పారు. ఈ సందర్భంగా వెండితో రూపొందించిన ఢమరుకం, త్రిశూలం చేతపట్టుకుని ఆ పరమశివుని స్తుతిస్తూ, పంచముఖ ఆంజనేయస్వామిని, శ్రీ వేంకటేశ్వరస్వామివారిని, అమ్మవార్లను కీర్తిస్తూ సుబ్బరామిరెడ్డి దాదాపు 45 నిమిషాల పాటు ఎంతో భక్తితో.. ఉద్వేగంతో చేసిన శ్లోకగానం అశేషభక్తజనాన్ని మంత్రముగ్ధులను చేసింది.

'34 ఏళ్ళుగా జరుగుతున్న ఈ మహాకుంభాభిషేక మహోత్సవాలు నా వారసత్వంగా నా మనుమడు రాజీవ్‌రెడ్డి నిర్వహిస్తాడని సభాముఖంగా వాగ్దానం చేస్తున్నా'నని టిఎస్ఆర్ చెప్పడమే కాక, తన మనవడితో అదేవిధంగా ప్రమాణం కూడా చేయించి అందరి ప్రశంసలు అందుకున్నారు. తన తాతగారి లాగానే ఆధ్యాత్మికబాటలో పయనించేందుకు కృషి చేస్తానని, వారెన్నో ఏళ్ళుగా చేస్తున్న ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాలను భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని రాజీవ్‌రెడ్డి ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సుబ్బరామిరెడ్డి.. మహా శివభక్తుడు - శ్రీ స్వరూపానందేంద్రస్వామీజీ

సుబ్బరామిరెడ్డి మహా శివభక్తుడని, ఆయన వంటి శివభక్తుడు దేశంలోనే లేరని శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ కొనియాడారు. విశాఖలో జ్యోతిర్లింగాలు లేకపోయినా శివభక్తులు ఇలా వేలసంఖ్యలో ఉన్నారంటే అందుకు టిఎస్సార్ కారణమని, ఆయన శివభక్తి భక్తులందరికీ స్ఫూర్తిదాయకమని, సముద్రం ఉన్నంతవరకూ టిఎస్ఆర్ కీర్తి విశాఖలో నిలిచే ఉంటుందని స్వామీజీ టిఎస్సార్‌ను ఆశీర్వదించారు. తొలుత ముక్కామల శ్రీధరస్వామిజీ జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభిస్తూ తన తపశ్శక్తినంతా ధారపోసి పొందిన హారాన్ని సుబ్బరామిరెడ్డికి బహుకరించి దీవించారు. ఈ వేడుకల్లో ప్రముఖ నటుడు, రాజమండ్రి ఎంపి మురళీమోహన్, ప్రఖ్యాత నటి జమున, కళాభినేత్రి వాణిశ్రీ, ప్రసిద్ధ గాయని పి.సుశీల, గీతాంజలి తదితరులతో పాటు మంత్రి గంటా శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే ద్రోణంరాజు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న ఆధ్యాత్మిక సంబరాలు

సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా టిఎస్సార్ లలితకళాపరిషత్ ఆధ్వర్యంలో ప్రముఖ కళాకారుడు గుమ్మడి గోపాలకృష్ణ సారధ్యంలో 'హరహర మహాదేవ' నాటకాన్ని అత్యద్భుతంగా ప్రదర్శించారు. డా.మీగడ రామలింగస్వామి బృందం ప్రదర్శించిన శ్రీకాళహస్తీశ్వర మహాత్మ్యం నాటకం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం గుమ్మడి గోపాలకృష్ణ, సాలూరు వాసూరావు, మీగడ రామలింగ స్వామి తదితరులతో పాటు పలువురు కళాకారులను ఘనంగా సత్కరించారు.




## బి.సరోజాదేవికి 'విశ్వనట సామ్రాజ్ఞి' అవార్డు

ఈ వేడుకల సందర్భంగా టిఎస్సార్ ఆధ్వర్యంలో అలనాటి మహానటి, పద్మభూషణ్ అవార్డు గ్రహీత బి.సరోజాదేవికి 'విశ్వనట సామ్రాజ్ఞి' బిరుదుతో పాటు స్వర్ణకంకణం, గజమాలతో ఘనంగా సత్కరించారు. అందుకు స్పందనగా బి.సరోజాదేవి మాట్లాడుతూ టిఎస్సార్ అవార్డును స్వీకరించడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. మహాశివరాత్రి పర్వదినం రోజున విశాఖకు రావడం, ఇక్కడి ప్రజలను చూడడం తనకెంతో ఆనందంగా ఉందన్నారు. ఎంతో ప్రఖ్యాతమైన 'చిటపట చినుకులు' పాట ఇక్కడే చిత్రీకరించారని ఆమె గుర్తుచేసుకున్నారు. తనను సత్కరించిన టిఎస్ఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com